PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 34 | విజయవాడ, మంగళవారం 3 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 3 September 2024 | Rs

నెతన్యాహూ గద్దె దిగు!

- ఇజ్రాయిల్‌లో ఊపందుకున్న ర్యాలీలు, ప్రదర్శనలు
- 5లక్షల మంది వీధుల్లోకి సమ్మెతో స్తంభించిన కార్యకలాపాలు

7

'వరద'వాడ

బుడమేరు విలయం...కృష్ణా ఉగ్రరూపం

ముంపులో 3.5 లక్షలమంది

బుడమేరు ఉధృతికి సోమవారం మహోగ్ర కృష్ణా తోడయింది. దీంతో విజయవాడ వరద వాడగా మారింది. బుడమేరు వరదతోనే నిస్సహాయులుగా మారిన నగర ప్రజానీకాన్ని కృష్ణమ్మ మహా ప్రవాహం నిశ్చేష్టులను చేసింది. శతాబ్దకాలంలో ఎన్నడూ లేని విధంగా 11.43 లక్షల క్యూసెక్కుల వరద ప్రకాశం బ్యారేజి నుండి సముద్రానికి పరుగులు తీసింది. దీంతో అటు విజయవాడతోపాటు తాడేపల్లిలోని పలు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. 3.50 లక్షల మంది బాధితులుగా మారారు. బాధిత ప్రజానీకానికి అటు ప్రభుత్వంతో పాటు, వివిధ ప్రైవేటు స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా సాయం చేస్తున్నాయి. అయినా, తీవ్ర ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సాయం అంతంతమాత్రంగానే అందుతోంది. మరోవైపు రానున్న 24 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరిక ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. (వివరాలు లోపలి పేజీల్లో)



కృష్ణలంకలో పర్యటిస్తున్న చంద్రబాబునాయుడు





అజిత్‌సింగ్ నగర్‌లో ఆహార పొట్లాల పంపిణీ. (ఇన్‌సెట్‌లో) డ్రోన్ ద్వారా అందిస్తున్న సహాయక కిట్టు

ప్రభుత్వ తప్పిదం వల్లే భారీ విపత్తు

- మాజీ సిఎం వైఎస్ జగన్
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ / అమరావతి బ్యూరో

వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలను చంద్రబాబు ప్రభుత్వం బేఖాతరు చేయడం వల్లే భారీ విపత్తు సంభవించిందని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. వర్షాలపై ప్రభుత్వం సరైన విధంగా సన్నద్ధమై ఉంటే ఇంతటి తీవ్ర విపత్తు సంభవించేదికాదని అన్నారు. విజయవాడలోని బుడమేరు, కృష్ణా నది వరద బాధితులను ఆయన సోమవారం పరామర్శించారు. వరద నీటిలో వెళ్లి బాధితులను కలిసి వారికి భరోసా కల్పించారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తాయనే విషయం గత నెల 28నే వాతావరణ శాఖ హెచ్చరించిందని తెలిపారు. ఆ హెచ్చరికను టిడిపి కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ తప్పిదం, అజాగ్రత్త వల్లే వరదలు వచ్చాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిర్లక్ష్యంపై చంద్రబాబు క్షమాపణలు చెప్పాలని, బాధితులను ఆదుకుని వారిని సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.



విజయవాడలో పర్యటిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

"విజయవాడలో దయనీయ పరిస్థితులు ఉన్నాయి. కనీసం తినడానికి తిండి కూడా లేదు. బాధితులకు సరిపడా బోట్లు ప్రభుత్వం ఇవ్వలేదు. చాలీచాలని విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం దారుణం. బాధితులకు సహాయ శిబిరాలు కూడా లేవు. ఒక్కరికి కూడా ప్రభుత్వం పైసా సాయం చేయలేదు. తాగడానికి నీరు, తినేందుకు తిండి లేదు. బాధితులు ఎక్కడికి వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. సహాయ శిబిరాలు ఎక్కడ ఉన్నాయో కూడా వారికి తెలియడంలేదు, వరదల్లో చిక్కుకున్న ప్రజలను పట్టించుకున్న దాఖలాలే కనిపించడం లేదు' అని వ్యాఖ్యానించారు. గతంలో ఇంతకంటే ఎక్కువగా భారీ వర్షాలు కురిశాయని, కానీ మనుషులు చనిపోయిన పరిస్థితులు ఎప్పుడూ లేవన్నారు. వైసిపి నేతలంతా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు.

గతంలో వలంటీర్లంతా సహాయక చర్యలు అందించేవారని, ప్రతి కుటుంబానికీ ఆర్థిక సహాయం అందించామని, సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో గడపగడపకూ సహాయం చేశామని చెప్పారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంతో తమకు ముంపు తప్పిందని కృష్ణలంక వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

రహస్య కెమెరాల ఘటనపై 2 వారాల్లోగా నివేదిక

- సిఎస్, డిజిపికి ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గర్ల్స్ హాస్టల్ వాష్‌రూమ్‌లలో రహస్య కెమెరాల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్), డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)కు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) నోటీసులిచ్చింది. రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలోని బాలికల హాస్టల్ వాష్‌రూమ్‌లలో రహస్య కెమెరాలు ఉన్నట్లు నివేదించబడిన సంఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) సుమోటాగా పరిగణనలోకి తీసుకుంది. మహిళల భద్రత, గౌరవ హక్కుపై తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తూ.. సిఎస్, డిజిపికి కమిషన్ నోటీసులు జారీ చేసింది.

పెరుగుతున్న పారిశ్రామిక ప్రమాదాలు

- జిఓ 62 దుర్మార్గం : సిహెచ్ నర్సింగరావు 5



వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న సిపిఎం నేతలు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, డి.రమాదేవి, వి.వెంకటేశ్వర్లు, కె.ప్రభాకర్‌రెడ్డి, కె.సుబ్బరావమ్మ, డివి.కృష్ణ, ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ తదితరులు

అదానీ సంస్థలపై దర్యాప్తులో సెబీ చీఫ్ ప్రమేయం

- బయటపెట్టిన సెబీ బోర్డు సభ్యుడు 3

నిందితుడైతే ఇల్లు కూల్చేస్తారా?

- బుల్డోజర్ న్యాయంపై సుప్రీం ఆగ్రహం
- దేశవ్యాప్తంగా మార్గదర్శకాలు రూపొందిస్తామని వెల్లడి



న్యూఢిల్లీ : 'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక కేసులో నిందితుడైనంత మాత్రాన లేదా దోషి అని తేలినంత మాత్రాన వారి ఆస్తులను ఎలా ధ్వంసం చేస్తారని ప్రశ్నించింది. ఇలాంటి కూల్చివేతలను చట్టం అనుమతించదని స్పష్టం చేసింది. అదే సమయంలో పబ్లిక్ రోడ్డుపై అక్రమంగా చేపట్టిన కట్టడాలను పరిరక్షించాలని కాదు అని వివరణ ఇచ్చింది. ఇళ్లు, లేదా దుకాణాలను కూల్చివేయడానికి ముందు దేశవ్యాప్తంగా అనుసరించాల్సిన కొన్ని మార్గదర్శక సూత్రాలను జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ ప్రతిపాదించింది. దేశంలో ఎక్కడా, ఎవరికీ ఇటువంటి బుల్డోజర్ న్యాయాన్ని వర్తింపజేయరాదని సుప్రీం స్పష్టంగా పేర్కొంది. బుల్డోజర్ కూల్చివేతలను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను విచారిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అత్యాచారం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడినట్లు అభియోగాలను ఎదుర్కొంటున్న నిందితుల ఇళ్లను కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గత కొంతకాలంగా కూల్చేస్తుండడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా పరిగణించింది. అక్రమ కట్టడాలను కూల్చివేయాల్సి వస్తే దానికి కూడా ఒక ప్రొసీజర్ ఉంటుంది. మొదట నోటీసు ఇవ్వాలి. దానికి బదులిచ్చేందుకు కొంత వ్యవధి ఇవ్వాలి. ఆ తరువాత దానిపై న్యాయపరమైన దిద్దుబాటుకు కూడా అవకాశమివ్వాలి. అవేమీ లేకుండా ఇష్టానుసారంగా కూల్చేస్తామంటే సహించేది లేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల17కి వాయిదా వేసింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు దుష్యంత్ దావె, సియు సింగ్ వాదనలను వినిపించగా. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. అక్రమ కట్టడాల కూల్చివేతకు మున్సిపల్ చట్టాలు అనుమతిస్తున్నాయని తుషార్ మెహతా చెప్పారు.

యుపిలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 15,000 మందిపై ముఖ్యంగా మైనార్టీలపై గ్యాంగ్‌స్టర్, అవాంఛనీయ కార్యకలాపాల చట్టం కింద కేసులు పెట్టి, వారి ఇళ్లను అక్రమ కట్టడాల పేరుతో కూల్చివేసింది.

టీచర్స్ డే అవార్డుల వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా నిర్వహించాల్సిన రాష్ట్ర ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టరు సుబ్బారావు వెల్లడించారు. మంగళగిరిలో సికె కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాటు చేశామని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులు, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులందరూ వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. పురస్కార గ్రహీతల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సం కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వెల్లడించారు. ఎప్పుడు నిర్వహిస్తామనే సమాచారాన్ని పత్రికా ముఖంగా తెలియజేస్తామని పేర్కొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి

సిపిఎం రాష్ట్ర కమిటీ

సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని పార్టీ శాఖలకు పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు 17 మంది దుర్మరణం చెందడం విచారకరమని, అనేకమంది గల్లంతయ్యారని వార్తలు వస్తున్నాయని, వరద బాధితులను వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. అదే సమయంలో సహాయ కార్యక్రమాల్లో అన్ని శాఖలు పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలో బుడమేరు పొంగడంతోపాటు, కృష్ణానది వరద వల్ల లక్షలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యారని తెలిపారు. బుడమేరు గేట్లు ఎత్తిన విషయం పరిసర ప్రాంతాల నివాసితులకు చేరవేయడంలో లోపం వల్ల నష్టం మరింత పెరిగిందని పేర్కొన్నారు. నాలుగు లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని తెలిపారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. నిరాశ్రయుల కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి, ఆహారం, వసతి, వైద్యం అందించాలని కోరారు. వరద సహాయ చర్యల్లో సిపిఎం శాఖలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సహాయ కార్యక్రమాలు బాధితులకు ఏ మాత్రమూ సరిపోవడం లేదని, కొన్నిచోట్ల హడావుడి తప్ప సహాయం అందడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇంతవరకూ సహాయం ప్రకటించలేదని, ముఖ్యమంత్రి కేంద్రాన్ని అభ్యర్థించినా ఇప్పటి వరకు ఎటువంటి సహాయం చేయలేదని తెలిపారు. కేంద్రం వెంటనే సహాయాన్ని ప్రకటించాలని, ఇళ్లలో నిత్యావసరాలు, సామాను అంతా వరదకు తడిసి పనికిరాకుండా పోయిందని తెలిపారు. నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసరాలు రేషన్‌తోపాటు ఉచితంగా అందించాలని, ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 వేలు తక్షణ సాయం ఇవ్వాలని కోరారు. వివిధ కుటుంబాలకు జరిగిన ఆస్తి నష్టాన్ని అంచనావేసి తగురీతిలో నష్టపరిహారం ఇవ్వాలని, ఇళ్ల పున:నిర్మాణానికి సహాయం చేయాలని కోరారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల నుండి రూ.20 వేల వరకూ నష్టపరిహారాన్ని ఇచ్చి రైతులను, కౌలు రైతులను, వరదల్లో ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కార్మికుల కుటుంబానికి రూ.10 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

రికార్డు స్థాయిలో వరద

- 125 ఏళ్ల ప్రకాశం బ్యారేజీ చరిత్రలో ఇదే అత్యధికం
- 11,43,414 క్యూసెక్కులు నమోదు
- దెబ్బతిన్న బ్యారేజీ 69వ గేట్
- తగ్గుముఖం పట్టిన ప్రవాహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా నది చరిత్రలో ప్రకాశం బ్యారేజీకి ఎన్నడూ రాని వరద ప్రవాహం సోమవారం నమోదైంది. ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాలను రెండు రోజులపాటు కునుకుతీయకుండా భయపెట్టిన కృష్ణా నది వరద సోమవారం మధ్యాహ్నానికి రికార్డు స్థాయిలో నమోదైంది. ఆదివారం వరకు 10 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వున్న కృష్ణా నదిలో సోమవారం ఉదయం 6 గంటలకు 11,25,876 క్యూసెక్కులు నమోదు కాగా, 8 గంటలకు 11,36,296 క్యూసెక్కులు నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలకు రికార్డు స్థాయిలో 11,43,414 క్యూసెక్కులు నమోదైంది. దాదాపు మూడు గంటలపాటు ఇదే ప్రవాహం కొనసాగి మధ్యాహ్నం 3 గంటలకు 11,43,201గా నమోదైంది. ఆ తర్వాత వరద తీవ్రత తగ్గడం ప్రారంభమైంది. సాయంత్రం 6 గంటలకు 11,27,801 క్యూసెక్కులు నమోదు కాగా, 7 గంటలకు 11,25,876 క్యూసెక్కులుగా రాత్రి 10 గంటలకు 11,14,326 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువన నాగార్జునసాగర్, పులిచింతల రిజర్వాయర్ల నుండి వచ్చే ప్రవాహం కూడా తగ్గుముఖం పట్టడానికి తోడు మున్నేరు వాగు, తదితర వాగుల నుండి వచ్చే ప్రవాహం కూడా రాత్రికి అంతా తగ్గుముఖం పట్టడంతో ప్రభుత్వ యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. కృష్ణా నదికి శ్రీశైలం ఎగువన 2009లో ఏకంగా 24 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. దిగువన నాగార్జునసాగర్‌లో నాడు నీటి నిల్వలు తక్కువగా వుండటంతో 2009లో ప్రకాశం బ్యారేజీ వద్ద అక్టోబరు 5వ తేదీన 10,94,422 క్యూసెక్కులు నమోదైంది. అలాగే 1903 అక్టోబరు 7న 10,60,830 క్యూసెక్కులు నమోదైంది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద 1903, 2009 నాటి వరదల కంటే ఎక్కువ వరద ప్రవాహం నమోదైంది. ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదిలో 125 ఏళ్ల బ్యారేజీ చరిత్రలో అత్యధికంగా ఇపుడు 11,43,414 క్యూసెక్కులు వరద ప్రవాహం నమోదైంది. వరదలు కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి ప్రకాశం బ్యారేజీ వైపు బోట్లు కొట్టుకొచ్చాయి. మూడు భారీ పడవలు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ప్రకాశం బ్యారేజ్ గేట్లలో 69వ నెంబర్ గేటు ధ్వంసమై ఒక పక్కకు ఒరిగిపోయింది. సోమవారం కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులన్నింటి వద్ద వరద తగ్గుముఖం పట్టింది. ఆల్మట్టి వద్ద 70 వేల క్యూసెక్కుల వరద వుండగా, నారాయణపూర్ వద్ద 30 వేల క్యూసెక్కులు నమోదైంది. జూరాల ప్రాజెక్టు వద్ద 3,20,000 క్యూసెక్కులు నమోదైంది. అలాగే శ్రీశైలం డ్యామ్‌లోకి 4,89,868 క్యూసెక్కులు, నాగార్జున సాగర్‌లోకి 5,40,503 క్యూసెక్కులు, పులిచింతల రిజర్వాయర్ వద్ద 5,48,059 క్యూసెక్కులు వరద ప్రవాహం ఇన్‌ఫ్లోగా నమోదయ్యాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా నది, ప్రకాశం బ్యారేజి 64వ గేటు వద్ద ఇరుక్కుపోయిన నాలుగు బోట్లు (ఇన్‌సెట్‌లో) ప్రకాశం బ్యారేజి వద్ద బోట్లు ఢీకొట్టడంతో దెబ్బతిన్న 64 నెంబరు గేటు))

బ్యారేజీ గేట్లను ఢీకొట్టిన బోట్లు

దెబ్బతిన్న 69వ గేటు

కృష్ణా నదికి వరదల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి ప్రకాశం బ్యారేజీ వైపు బోట్లు కొట్టుకొస్తున్నాయి. నాలుగు భారీ బోట్లు వేగంగా వచ్చి ఢీకొట్టి చిక్కుకుపోయాయి. ఇలా ఢీకొట్టిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. ఈ సంఘటనతో 69వ నెంబర్ గేటు ధ్వంసమైంది. అది ఒక పక్కకు ఒరిగింది.

19 మంది మృతి, ఇద్దరు గల్లంతు

- 4.26 లక్షల ఎకరాల్లో వరి నష్టం
- 36,964 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- 1,808 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం
- సహాయ చర్యల్లో 36 ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వరదలు, వర్షాలకు 19 మంది మరణించారు. ఇద్దరు గల్లంతయ్యారు. ముంపు బాధిత ప్రాంతాల్లో నష్టాలు, సహాయక చర్యలపై విపత్తుల నిర్వహణశాఖ అధికారులు బులెటిన్ విడుదల చేశారు. వేర్వేరు ప్రాంతాల్లో గత రెండు రోజులుగా మరణాల సంఖ్య పెరిగిందని తెలిపారు. అధిక వర్షాల వల్ల 1,808 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బి రోడ్లు ధ్వంసం అయ్యాయని తెలిపారు. 136 పశువులు, 59,700 కోళ్ల మరణించాయని పేర్కొన్నారు. 134 పశువైద్యశిబిరాలు ఏర్పాటుచేసి ఆరు వేల పశువులకు వ్యాక్సిన్లు వేసినట్లు వివరించారు. ముఖ్యంగా 4.26 లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని తెలిపారు. అలాగే 36,964 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని వివరించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద రాత్రి ఎనిమిది గంటల సమయానికి 11.25 లక్షల క్యూసెక్కులకు నీరు తగ్గిందని, మునేరులో ప్రవాహం ఉధృతి తగ్గుతుండటంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కూడా నీరు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటి వరకూ 176 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి 41,927 మందిని తరలించినట్లు పేర్కొన్నారు. 171 వైద్య శిబిరాలు ఏర్పాటుచేశామన్నారు. సహాయ చర్యల్లో 36 ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు పాల్గొన్నాయి. బాధితుల కోసం రోజుకు మూడు లక్షల ఆహార ప్యాకెట్లు, తాగునీరు ఎప్పటికప్పుడు అందించేందుకు ఐదు హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నామని వివరించారు. మొత్తంగా 188 బోట్లు, 283 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎటువంటి సహాయం కోసమైనా టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101ను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

ఆధునీకరణ, పర్యవేక్షణ లేదు

- బుడమేరు ముంపు ముందస్తు హెచ్చరికలో తీవ్ర లోపం
- సిఎం ఆదేశించినా ప్రజలకు సాయం చేరడంలో జాప్యం
- సింగ్‌నగర్ ప్రాంతంలో ప్రచారం వేరు, వాస్తవం వేరు
- రెండు రోజులుగా తాగేందుకు నీరులేక అవస్థలు
- వేలల్లో వసూలు చేస్తున్న ప్రైవేటు బోట్ల యజమానులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బుడమేరును ఆధునీకరించాం. ఇక ముందు ముంపు సమస్య ఉండదని గతంలో పాలకులు ప్రకటించారు. ప్రజలు నిజమే అనుకున్నారు. కానీ ఆచరణలో అదంతా అబద్ధమని తేలిపోయింది. విజయవాడ నగరంలో సుమారు మూడు లక్షల మంది ప్రజలను బుడమేరు ముంచేసింది. రెండు రోజులుగా తినేందుకు ఆహారం, తాగేందుకు నీరు లేక వేలమంది ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. అన్నీ చేస్తున్నామనే ప్రచారం మీడియాలో వస్తున్నా ఆచరణలో దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. సుమారు 2.76 లక్షల మంది ప్రజలు ముంపునకు గురయ్యారని ప్రకటించిన ప్రభుత్వం రెండోరోజు సాయంత్రానికి 41 వేలమందిని మాత్రమే తరలించామని అధికారికంగా ప్రకటించింది. అంటే రెండు లక్షల 30 వేలమంది ప్రజలు ఇంకా ముంపులోనే ఉన్నారు. మొదటి అంతస్తులో ఉన్నవారు పైకివెళితే లేనివారు రేకులపైనే పడుకున్నారు. చాలా మంది రెండు రోజుల నుండి కనీస పరిమాణంలో నీరు కూడా తాగలేకపోతున్నారు. కొద్దిపాటి నీటితో నోరు తడుపుకుంటున్నారు. రాష్ట్రంలో అత్యంత కీలక నగరమైన విజయవాడలో అన్ని సదుపాయాలూ ఉండి రెండురోజులపాటు తీవ్ర అవస్థలు ఎదుర్కోవడం తీవ్ర బాధాకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తెలిపారు. ముఖ్యంగా నందమూరి నగర్, రాజరాజేశ్వరీపేట, జక్కంపూడి, పాయకాపురం, కండ్రిక, వాంబేకాలనీ, ఉడా కాలనీ, వన్‌టౌన్ పరిధిలో ఊర్మిళానగర్, కబేళా, భవానీపురం తదితర ప్రాంతాల్లో చాలాచోట్ల పది అడుగులకు మించి నీరు నిలిచిపోయింది.

ముందస్తు హెచ్చరికలో తీవ్ర లోపం

వాస్తవంగా 29వ తేదీన వాతావరణశాఖ హెచ్చరించింది. బుడమేరు పైభాగంలో అతితీవ్ర వర్షం కురుస్తోంది. ఈ నీరంతా బుడమేరుకు చేరుతుంది. ముందుగానే అధికారులు అప్రమత్తమై బుడమేరు పొంగుతుందని తగు హెచ్చరికలు చేసి ఉంటే ఇంత తీవ్ర నష్టం జరిగి ఉండేది కాదు. ముంపు వస్తుందని తెలిసి ఇళ్లకు చేరుకునేలోపే నీరు రెండు నుండి మూడు అడుగుల ఎత్తుకు చేరిపోయింది. అత్యంత తీవ్రంగా వరదొచ్చి పడింది. ముందు జాగ్రత్తగా హెచ్చరించి నష్టాన్ని నిలువరించే అవకాశం ఉన్నా, ఆ దిశగా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. 15 సంవత్సరాల క్రితమే ముంపు నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పి ఆధునీకరణకు నిధులు కేటాయించారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుండి బుడమేరు డైవర్షన్ ఛానల్ ఆధునీకరణ పూర్తిగా చేయలేదు. అత్యంత కీలకమైన విషయం ఏమిటంటే బుడమేరు క్యాచ్‌మెంట్ ఏరియాలో పడిన వర్షాలకు చెరువులు నిండి కట్టలు తెగి భారీగా వరద వచ్చింది. చెరువుల నిర్వహణ సరిగ్గా ఉన్నా, ముందస్తు హెచ్చరికలు చేసినా సమస్య ఇంత తీవ్రంగా ఉండేది కాదు. వెలగలేరు నుండి బిడిసిని పోలవరం కాలువతో కలిపేశారు. అంతటితో చేతులు దులుపుకున్నారు మినహా భారీ వరద వస్తే ఏమి చేయాలనే అంశంపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇది కూడా పెనుముంపునకు కారణమైంది.

కొంప ముంచుతున్న కొల్లేరు

బుడమేరు నీరు దిగువ భాగంలో ఏలూరు జిల్లా కొల్లేరులో కలుస్తుంది. అక్కడ చేపల చెరువులు తవ్వేయడంతో నీరు నేరుగా దిగువకు వెళ్లడం లేదు. బుడమేరు దిగువన ఉప్పుటేరులో కలుస్తుంది. ఈ నీరు నేరుగా దిగువకు వెళ్లే అవకాశం ఉంటే నీటి ప్రవాహం కూడా తగ్గుతుంది. పైన ముంపు సమస్య ఒకటైతే రెండోది దిగువన వరద నీటిని లాగేసుకునే కొల్లేరులో చెరువుల రూపంలో అడ్డుకట్టలో మరొక ప్రధాన సమస్యగా ఉంది.

వెయ్యి సోలార్ లాంతర్లు అందించిన ఇంధనశాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో భాగంగా ఇంధనశాఖ వెయ్యి సోలార్ లాంతర్లను అందజేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, సోలార్ పవర్ కార్పొరేషన్ ఎమ్‌డి ఎం కమలాకర్ బాబు సోమవారం కలిసి విజయవాడలోని కలెక్టరేట్‌లో అందజేశారు. మరో 4 వేల లాంతర్లను తయారుచేసి అందిస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ లాంతర్లను వార్డు సచివాలయ సిబ్బందికి అప్పగించాలని ఆదేశించారు. సిపిడిసిఎల్ పరిధిలో రూ.1.87 కోట్ల నష్టం జరిగినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. 33కెవి స్టేషన్లు 75 దెబ్బతిన్నాయని, వీటిల్లో 57 పునరుద్ధరించామని తెలిపారు. 11కెవి స్టేషన్లు 521 దెబ్బతినగా, 437 పునరుద్ధరించామని వెల్లడించారు. 356 మంది 102 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. చిల్లకల్లు ఫీడర్ పూర్తిగా దెబ్బతిందని పేర్కొన్నారు. బుడమేరు నీరు విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ (విటిపిఎస్)లో చేరడంతో 1 నుంచి 6 యూనిట్లు ట్రిప్ అయ్యాయని తెలిపారు. 5, 6 యూనిట్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. 800 మెగావాట్ల (మెవా) సామర్థ్యం ఉన్న 8 యూనిట్ ట్రిప్ అయిందని, ఈ నెల పదో తేదీ నాటికి అందుబాటులోకి వస్తుందని అన్నారు. 500 మెగావాట్ల యూనిట్‌కు వార్షిక నిర్వహణ మరమ్మతుల్లో ఉందని పేర్కొన్నారు. ఆదివారం జలవిద్యుత్ 1,330 మెగావాట్ల ఉత్పత్తి అయ్యిందని తెలిపారు.

వరద సహాయక చర్యలను పర్యవేక్షించిన లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వరద సహాయ చర్యలను విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం నుంచి వరద అంచనా, బోట్ ఆపరేషన్, ఆహారం, తాగునీరు పంపిణీ, విద్యుత్ సరఫరాలపై అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహించారు. సహాయ చర్యలపై విభాగాల వారీ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వివిధ ప్రాంతాల నుంచి ఆహారాన్ని రప్పించి బాధితులకు చేరవేసే బాధ్యతను ఐఎఎస్ అధికారి జి వీరపాండ్యన్‌కు అప్పగించారు. అప్పగించిన బాధ్యతను ఏ మేరకు పూర్తిచేశారన్న అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రకాశం బ్యారేజ్ భద్రతపై ఎటువంటి ఆందోళన చెందొద్దని ప్రజలకు సూచించారు. వరద సహాయ చర్యల్లో పెద్దయెత్తున పాల్గొనాలని టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు.

వరద ప్రాంతాల్లో డిజిపి పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని వరద ప్రాంతాల్లో డిజిపి ద్వారకా తిరుమలరావు సోమవారం పర్యటించారు. వరద ముంపులో చిక్కుకు పోయిన బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే కార్యక్రమాలను స్వయంగా పరిశీలిస్తూ పోలీసు యంత్రాంగానికి సూచనలు చేస్తూ వరద ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలకు, ఫైర్, లా అండ్ ఆర్డర్ సిబ్బందికి సూచనలు ఇస్తూ వరద ప్రాంతాలన్నింటినీ పరిశీలించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు.

విజయవాడ ఆర్‌టిసి బస్టాండ్‌లో వరద బాధితులకు ఆహార ఏర్పాట్లు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలు, కృష్ణా నదికి వచ్చిన భారీ వరదల నేపథ్యంలో పలు ఆర్‌టిసి సర్వీసులు రద్దయి బస్టాండ్‌లోనే వేచి వున్న ప్రయాణికులకు ఎపిఎస్‌ఆర్‌టిసి ఉచిత భోజన ఏర్పాట్లు చేసింది. విజయవాడ, హైదరాబాద్ రోడ్డుపై రవాణా నిలిచిపోవడం దాదాపు రెండు వేల మంది ప్రయాణికులు ఆర్‌టిసి బస్టాండ్‌లోనే వుండిపోయారు. బస్సులను తిరిగి పునరుద్ధరించే వరకు వారికి ఆర్‌టిసి యాజమాన్యం భోజన ఏర్పాట్లు చేసింది. దాదాపు రెండు వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. అలాగే ఇతర ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకుపోయిన బాధితుల కోసం ఆర్‌టిసి 30 వేల భోజన ప్యాకెట్లను పంపింది.

బాధిత కుటుంబాలకు 75వేల మందుల కిట్లు

- వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని వరద బాధితులకు దాదాపు 75వేల అత్యవసర మందుల కిట్ల పంపిణీ చేయనున్నట్లు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. నగరంలో ఏర్పాటు చేసిన 14 మెడికల్ రిలీఫ్ క్యాంపులకు అత్యవసర కిట్లు చేరవేసినట్లు వివరించారు. మరికొన్ని కిట్లను 10 మొబైల్ మెడికల్ వాహనాల ద్వారా అందించనున్నట్లు చెప్పారు. రిలీఫ్ క్యాంపుల్లో 24 గంటలూ వైద్య సేవలందించేందుకు వైద్యులు, సిబ్బందితో పాటు సరిపడా మందుల్ని అందుబాటులో ఉంచామని వెల్లడించారు. పారిశుద్ధ్యం, నీటి కాలుష్యం వల్ల సంభవించే జ్వరం, జలుబు, వాంతులు, విరోచనాలు వంటి అనారోగ్య సమస్యలకు ఏయే మందులు ఎలా వేసుకోవాలని కరపత్రాల్లో వివరించామని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యల విషయంలో బాధితులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలిపారు.

అన్నమయ్య జిల్లాలో అమానుషం

- విద్యార్థినిపై ప్రిన్సిపల్ భర్త లైంగిక దాడి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అమానుషం చోటు చేసుకుంది. విద్యార్థినిపై ప్రిన్సిపల్ భర్త లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తోటి విద్యార్థులు, పోలీసుల సమాచారం మేరకు.. ఆదివారం సాయంత్రం పాఠశాల ఆవరణంలో ఆరేసిన బట్టలు తీసుకు రావడానికి వెళ్లిన విద్యార్థినికి ప్రిన్సిపల్ భర్త బాలసుబ్బయ్య మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం వెలుగులోకి రావడంతో ప్రిన్సిపల్ భర్తను పోలీసుల సోమవారం అరెస్టు చేశారు. విద్యార్థిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. పాఠశాలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సందర్శించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాలు జారీ చేశారని మంత్రి చెప్పారు. ప్రిన్సిపల్ భర్త, ప్రిన్సిపల్‌పై ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామని, నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామని సిఐ కొండారెడ్డి తెలిపారు.



దెబ్బతిన్న బ్యారేజి గేటును పరిశీలించిన సిఎం

ప్రజాశక్తి- విజయవాడ

కృష్ణా నదిలో కొట్టుకొచ్చిన నాలుగు బోట్లు ఢీకొని దెబ్బతిన్న ప్రకాశం బ్యారేజీ గేటును సోమవారం రాత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించారు. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీలో నైలాన్ తాడుతో లంగర్ వేసిన నాలుగు బోట్లు వరద ఉధృతికి కొట్టుకొచ్చి గేట్లను బలంగా ఢీకొట్టడంతో రెండు గడ్డర్లు దెబ్బతిన్నాయని ఇంజనీర్లు సిఎంకు వివరించారు. సత్వరమే దెబ్బతిన్న గడ్డర్ల స్థానంలో కొత్త వాటిని అమర్చాలని, అవసరమైతే ఉన్నత స్థాయి ఇంజనీర్ల సలహా తీసుకోవాలని సిఎం సూచించారు. అనంతరం జక్కంపూడి, సింగ్‌నగర్లలో సిఎం పర్యటించారు.

నిర్లక్ష్యం సహించం

- సిఎం హెచ్చరిక
- సమీక్షలు... పర్యటనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. విజయవాడలోని వరద పీడిత ప్రాంతాల్లో వరుసగా రెండవ రోజైన సోమవారం కూడా ఆయన విస్తృతంగా పర్యటించారు. అంతకుముందు ఆదివారం అర్ధరాత్రి వరకు ముంపు ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించిన ఆయన ఆ తరువాత కలెక్టరేట్లో బస్సులో పడుకున్నారు. ఉదయం లేవగానే అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్కడ నుండి నేరుగా ట్రాక్టర్‌పై సింగ్‌నగర్ చేరుకున్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి పడవలో పర్యటించారు. అక్కడ నుండి నేరుగా సితారాసెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ట్రాక్టర్ వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో జెసిబిపై ప్రయాణించారు. అక్కడ నుండి నేరుగా రామలింగేశ్వరనగర్ చేరుకుని బాధితులతో మాట్లాడటంతోపాటు కృష్ణానది వరద తీవ్రతను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి పర్యవేక్షించారు. అక్కడ నుండి కలెక్టరేట్లోని కంట్రోల్ రూముకు చేరుకుని వరద సాయం, కేంద్ర బృందాల రాక తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమయంలో విఆర్‌లో ఉన్న పోలీసు ఉన్నతాధికారులు సేవలు అందిస్తున్న ప్రాంతాల్లో సహాయక చర్యలు సరిగా జరగడం లేదని కొందరు మంత్రులు సిఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. ఇష్టం లేకపోతే రాజీనామాలు చేసి వెళ్లిపోవాలి తప్ప వరద సహాయ చర్యలను నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వారిని ఎందుకు పంపించారని డిజిపిని ప్రశ్నించగా, విఆర్‌లో ఉన్నందున అత్యవసర సాయం కోసం పంపించామని సమాధానం ఇచ్చారు. దీనికి స్పందించిన సిఎం వెంటనే వారి తీరుపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం డ్రోన్లద్వారా సహాయం అందించడాన్ని కలెక్టరేట్లో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. సుమారు పదికేజీల బరువును తీసుకెళ్లే విధంగా అవి పనిచేయడంతో వెంటనే పనిలో పెట్టాలని, అలాంటి డ్రోన్లు ఎక్కడున్నా తీసుకొచ్చి వెంటనే సహాయ చర్యల్లో వాడాలని ఆదేశించారు. అలాగే కృష్ణానది దిగువ ప్రాంతాల్లో ప్రాణనష్టం జరగకుండా చూడాలని, వీలైనంత తొందరగా జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. సాయంత్రం మరోమారు వరద ప్రాంత పర్యటనకు వెళ్లారు. అక్కడ నుండి నేరుగా ప్రకాశం బ్యారేజీకి చేరుకుని బోట్లు గుద్దుకుని దెబ్బతిన్న కాంక్రీటు గడ్డరును పరిశీలించారు.

బోట్లు రావడంపై అనుమానం ఉంది

ప్రకాశం బ్యారేజీ వద్దకు ఒకేసారి నాలుగు బోట్లు కొట్టుకురావడం వెనుక అనుమానాలు ఉన్నాయని ముఖ్యమంత్రి దృష్టికి మంత్రి నిమ్మల రామానాయుడు తీసుకువెళ్లారు. అన్ని బోట్లు రావడంలోకుట్రకోణం దాగుందనే అంశంపైనా విచారణ జరుపుతామని సిఎం చెప్పారు.

నా క్యాంపు కార్యాలయాలను పునరావాస కేంద్రాలుగా వాడుకోండి

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైతే తన క్యాంపు కార్యాలయాలను పునరావాస కేంద్రాలుగా ఉపయోగించుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆ శాఖ అధికారులకు తెలిపారు. విజయవాడ, గుంటూరు, రేపల్లెలో తన క్యాంపు కార్యాలయాలు ఉన్నాయని వెల్లడించారు. గతంలో వరదల వల్ల కోతలకు గురైన కరకట్టల మరమ్మతు పనులను అధికారులు వెంటనే చేపట్టాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పలుచోట్ల కరకట్టలు దెబ్బతిన్నాయని, వర్షాలు తగ్గుముఖం పట్టిన చోట కరకట్ట పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కట్ట కింద ఉండే గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలోని కరకట్టల పటిష్టతపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో ఇప్పుడు మరింత ప్రమాదం ఏర్పడిందని విమర్శించారు. ఈ వర్షాల వల్ల పాముకాట్లకు గురయ్యే ప్రమాదం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ వాటి మందులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.

వరద ప్రాంతాల్లో మంత్రులు పర్యటన

విజయవాడలోని వరద ప్రాంతాల్లో రాష్ట్ర మంత్రులు సోమవారం పర్యటించి బాధితులకు సహాయం అందించారు. బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత తాడిగడప, పెనమలూరు, గణపతినగర్, శ్రీనగర్ కాలనీల్లో పర్యటించారు. శ్రీనగర్ కాలనీలో బోటులో పర్యటించి బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు అజిత్‌సింగ్ నగర్‌లో పర్యటించారు. బాధితుల వద్దకు వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలందరికీ ఆహార పదార్థాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎంఎస్‌ఎంఇ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అజిత్‌సింగ్ నగర్, పశువుతోట ప్రాంతాల్లో పర్యటించారు బాధితుల విజ్ఞాపనలు విన్న మంత్రులు సమస్యల పరిష్కారం కోసం తగిన సూచనలు చేశారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దెబ్బతిన్న ప్రకాశం బ్యారేజ్ ప్రాంతాన్ని సందర్శించారు.

సహాయం కోసం ఎదురుచూపు



వరద సహాయక చర్యల కోసం బయట నుండి తీసుకువచ్చిన బోటును విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో క్రేన్ ద్వారా నీటిలోకి దించుతున్న దృశ్యం

- మాకు భోజనం పెట్టండి ప్లీజ్ అంటూ ప్లకార్డులు
- అర లీటర్ పాలు రూ.70
- తాగునీటికి కొరత
- రంగంలోకి దిగిన నేవీ హెలికాప్టర్లు

ప్రజాశక్తి- యంత్రాంగం

వరద బాధితులందరికీ ప్రభుత్వ సాయం అందడం లేదు. సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి లోపించింది. దీంతో, తీవ్రంగా ప్రభావితమైన లోతట్టు, ప్రాంతాల్లోని వారు, కొండలపై నివసిస్తున్న వారు భోజనం, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ప్రాంతాలకు ముంపు విస్తరిస్తోంది. బుడమేరు ముంపునకుతోడు కృష్ణమ్మ వరద విజయవాడ వాసులను, నది పరివాహక ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. బుడమేరు ముంపు నుండి కాపాడేందుకు తగినన్ని బోట్లు రాకపోవడంతో బాధితులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 110 బోట్లు సరిపోకపోవడంతో ఆహారం, మంచినీరు సరిగా అందడం లేదు. అజిత్‌సింగ్ నగర్‌లో భవనాలపై నుండి 'మాకు భోజనం పెట్టండి ప్లీజ్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

నగరంలో 16 డివిజన్లలో మూడున్నర లక్షల మందికిపైగా ప్రజలు రెండు రోజులుగా ముంపులోనే ఉన్నారు. మంచినీరు, ఆహారం, విద్యుత్ లేక అవస్థలు పడుతున్నారు. పసిపిల్లలకు పాల ప్యాకెట్లు కూడా దొరకడం లేదు. పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు. తమ కుటుంబ సభ్యులు వరదల్లో చిక్కుకున్నారని, కాపాడండని వేడుకొంటున్నారు. ఆహారం సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై పెట్టుకోవడంతో వరదలో చిక్కుకున్న వారికి అందడంలేదని వాపోతున్నారు. ఫ్లైఓవర్ దగ్గర ఉంటే అక్కడి నుండి వెళ్లిపోవాలంటూ పోలీసులు తోసేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిని అవకాశంగా తీసుకొని కొందరు ప్రయివేటు యజమానులు తమను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రూ.1500 నుండి రూ.4 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. కొందరు అర లీటరు పాల ప్యాకెట్‌ను రూ.70కు అమ్ముతున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆదివారం రాత్రంతా చిమ్మచీకట్లో ముంపు బాధితులు గడిపారు. మేడలు, మిద్దెలపైనే ఉండిపోయారు. తీవ్ర ప్రభావానికి గురైన అజిత్‌సింగ్ నగర్, నందమూరి నగర్, ఆంధ్రప్రభ కాలనీ, ఎల్‌బిఎస్ నగర్, వాంబే కాలనీ, అయోధ్య నగర్, మధురా నగర్, రామకృష్ణాపురం, కొత్త రాజరాజేశ్వరిపేట, పాత రాజరాజేశ్వరిపేట, పైపుల రోడ్డు, కండ్రిక, పాయకాపురం, శాంతి నగర్, ప్రశాంతి నగర్, జక్కంపూడి, పాతపాడు, పి.నైనవరం, చిట్టినగర్, మిల్క్ ప్రాజెక్ట్, వించిపేట, భవానీపురం హెచ్‌బి కాలనీ, విద్యాధరపురం వంటి ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. కొందరు బాధితులు తమ పిల్లలు, వృద్ధులు, మహిళల కోసం రెండు మూడు కిలోమీటర్ల మేర నడుములోతు నీటిలో వచ్చి ఆహారం, పాలు, మంచినీరు తీసుకుని వెళ్తున్నారు.

కృష్ణా నదిలో బోటు బోల్తా

కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలంలో పునరావాస శిబిరానికి వరద బాధితులను తీసుకెళు తున్న బోటు అన్నవరపులంక వద్ద బోల్తా పడింది. ఈ సమయంలో బోటులో ఎనిమిది మంది ఉన్నారు. వీరందరినీ రెస్క్యూ టీం రక్షించింది.

బుడమేరు ముంపులో రెస్క్యూ ఆపరేషన్ -రంగంలోకి దిగిన నేవీ హెలికాప్టర్లు

బుడమేరు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో అగ్నిమాపక, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. కేంద్రం నుంచి పది ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు విజయవాడ చేరుకున్నాయి. పంజాబ్ నుండి నాలుగు, తమిళనాడు, ఒడిశా నుంచి మూడేసి చొప్పున బృందాలు పవర్ బోట్లు, రెస్క్యూ పరికరాలతో గన్నవరం విమానాశ్రయానికి వచ్చాయి. సుమారు వంద మందితో కూడిన ఈ బృందాలు ఆహార పొట్లాలను అందించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ బృందంలో డాగ్ స్క్వాడ్ కూడా ఉంది. రెస్క్యూ టీమ్‌లు నేవీ హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నాయి. ఇప్పటికే ఎన్‌టిఆర్ జిల్లా సహాయక చర్యల్లో ఎనిమిది ఎన్‌డిఆర్‌ఎఫ్, పది ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. వరదలో చిక్కుకున్న వారిని తాడు సాయంతో సురక్షిత ప్రాంతాలకు తీసుకొస్తున్నాయి.

బెంబేలెత్తిస్తున్న కృష్ణా నది వరద

ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా నది పరీవాహక ప్రాంతాల ప్రజలను బెంబేలెత్తిస్తోంది. కనకదుర్గ వారధి కరకట్ట గోడ వద్ద కోతకు గురి కాకుండా ఇసుక బస్తాలను ఏర్పాటు చేశారు. కృష్ణా నదికి రిటైనింగ్ వాల్ నిర్మాణంతో భారీ ప్రమాదం తప్పినా లీకేజీ సమస్యలతో రామలింగేశ్వర నగర్ ప్రజలు ముంపు బారిన పడ్డారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ప్రకాశం బ్యారేజీ ఎగువన వరద రివర్స్‌లో పైకి తన్ని రోడ్లపైకి వస్తోంది. బుడమేరు, కృష్ణా నది వరద భవానీపురం, స్వాతీ సెంటర్ వద్ద రోడ్డుపైకి చేరింది. అవనిగడ్డ వద్ద పులిగడ్డ అక్విడెక్ట్ నీట మునిగింది. దివిసీమలోని పంట పొలాలు, ఇళ్లలోకి వరద నీరింది. లంక గ్రామాలు, కృష్ణా పరీవాహక ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు.

గరికపాడు వద్ద వాహనాల రాకపోకలకు అనుమతి

విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రా నుంచి వచ్చే వాహనాలను తెలంగాణ పోలీసులు ఆదివారం వరకూ అనుమతించలేదు. దీంతో, ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గరికపాడు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు నిలిచిపోయాయి. వాటిని ఎట్టకేలకు సోమవారం అనుమతించడంతో హైదరాబాద్‌కు వాహనదారులు బయలుదేరారు. దీంతో, కొంత ఉపశమనం లభించింది.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

బుడమేరు, కృష్ణా వరద ముంపుపై సిపిఎం నేతల బృందం

ముంపు ప్రాంతాల్లో పర్యటన

ఆహారం, కొవ్వొత్తులు పంపిణీ

ప్రజాశక్తి- విజయవాడ, అర్బన్

బుడమేరు, కృష్ణా నది వరద ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. బాధిత ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరారు. విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం వేగంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా నది, బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లో సిపిఎం రాష్ట్ర నేతల బృందం సోమవారం పర్యటించింది. బాధితులకు సిపిఎం నేతలు రొట్టెలు, ఆహారం పంపిణీ చేసింది. కృష్ణా నది పరీవాహక ప్రాంతమైన విజయవాడ రామలింగేశ్వర నగర్, బుడమేరు ముంపు ప్రాంతమైన అజిత్‌సింగ్ నగర్లలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, డి.రమాదేవి, వి.వెంకటేశ్వర్లు, కె.ప్రభాకర్ రెడ్డి, కె.సుబ్బరావమ్మ, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణా, జిల్లా నేతలు డి.కాశీనాథ్, ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, పి.కృష్ణ తదితరులు పర్యటించారు. వరదల్లో మునిగిన ఇళ్లను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కనీస సహాయం కూడా తమకు అందడంలేదని వాపోయారు. ప్రభుత్వం బుడమేరు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు చేయలేదని, తగిన జాగ్రత్తలు తీసుకోలేదని వివరించారు. తమను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి ఏర్పాట్లు చేయలేదని, కనీస సౌకర్యాలు కల్పించలేదని, తమ గోడు వినే నాథుడు కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యటనలు, హడావుడి ఎక్కువ, నిర్దిష్ట చర్యలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ ఇళ్లల్లో తలదాచుకున్న బాధితులకు కనీసం మంచినీరు, ఆహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులను సురక్షితంగా బయటకు తరలించాలని, ప్రభుత్వ యంత్రాంగం లోపాలు సరిదిద్దుకుని సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో బాధితులను ఆదుకోవడంపై దష్టి పెట్టాలని, రెండు రోజులు గడుస్తున్నా సహాయ, సేవా కార్యక్రమాలు తగినంతగా లేకపోవడం శోచనీయమని అన్నారు. ముఖ్యమంత్రి ప్రకటనలకు, యంత్రాంగం ఆచరణకు పొంతన లేకుండా ఉందని తెలిపారు. కృష్ణా నది నుంచి రక్షణకు గోడ నిర్మించినా వరద ముంపు తప్పకపోవడం బాధాకరమన్నారు. బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలను ప్రభుత్వం చేపట్టాలని, బుడమేరు ఆధునీకరణ ప్రాజెక్టును తిరిగి ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. బుడమేరు ముంపు ప్రాంతాలైన అజిత్‌సింగ్‌నగర్, బుడమేరు మధ్యకట్ట, దేవీ నగర్, రాజరాజేశ్వరిపేట, అయోధ్య నగర్, సూర్య కాలనీ తదితర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పర్యటించి ఆహారం పంపిణీ చేశారు. బాధితులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.


విజయవాడ అజిత్‌సింగ్ నగర్లో ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సిపిఎం నేతలు

వర్షాలకు 1763 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం

- 73 చెరువులకు గండ్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారీ వర్షాలకు, వరదల కారణంగా రోడ్లకు పెద్దఎత్తున నష్టం కలిగింది. 154 ప్రాంతాల్లో రోడ్లపైన నీరు పారింది. 165 ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. రోడ్లు భవనాలకు చెందిన 1,763 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసం అయ్యాయి. 18 ప్రాంతాల్లో రోడ్లు వరదలకు కోతకు గురయ్యాయి. కోతకు గురైన రోడ్లను పునరుద్ధరించే పనుల్లో అధికారులు పని చేస్తున్నారు. పంచాయతీరాజ్‌కు చెందిన 74 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి. 15 రోడ్లు భారీగా కోతకు గురయ్యాయి.

73 చెరువులకు గండ్లు

రాష్ట్రంలోని ఏలూరు, ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల్లో 73 చెరువులకు గండ్లు పడ్డాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో 61 చెరువులు, గుంటూరు జిల్లాలో నాలుగు చెరువులు, ఏలూరు జిల్లాలో ఎనిమిది చెరువులకు గండ్లు పడ్డాయి. బుడమేరు వాగుకు ఆరు చోట్ల భారీగా గండ్లు పడ్డాయి.


పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, తదితరులు

వరద బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - గుంటూరు

గత నాలుగు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు నీటమునిగిన పంటపొలాలను, ఇళ్లను సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం తక్షణ సాయం చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మహానాడులో నీటమునిగిన ఇళ్లను సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు పరిశీలించారు. తాడేపల్లి రూరల్ చిర్రావూరిలో ముంపునకు గురైన లంకపొలాలను రైతు సంఘం నాయకులు జొన్నా శివశంకరరావు బృందం పరిశీలించింది. కొల్లిపర మండలం వల్లభాపురం, మున్నంగి, బొమ్మువానిపాలెం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించారు. వరదల్లో చిక్కుకున్న కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి భోజన, వైద్య సదుపాయం కల్పించాలని అధికారులను కోరారు .దుగ్గిరాల మండలంలో వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామాల్లో ముంపు ప్రాంతాలను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, పల్నాడు జిల్లా అమరావతిలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ బృందం పర్యటించింది.


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి, మాజీమంత్రి ఆలపాటి

త్వరలో సొంత భవనం

- మరమ్మతులకు రూ.7 లక్షలు మంజూరు
- గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలించిన మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. భారీ వర్షాలకు తెనాలిలోని గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాల తరగతి గదులు, విద్యార్థినుల హాస్టల్‌లోకి నీరు చేరడంతో సమీపంలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థినులను ఆమె సోమవారం పరామర్శించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి పాఠశాలను పరిశీలించారు. పాఠశాల, వసతి గృహంలో సౌకర్యాల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాఠశాల భవనం పల్లపు ప్రాంతంలో ఉందని తెలిపారు. భవన నిర్మాణం జరిగిన తరువాత రోడ్ల నిర్మాణం చేపట్టడంతో వర్షాలకు నీరు చేరిందని, తక్షణమే మరమ్మతులకు రూ.7 లక్షలు మంజూరు చేస్తామన్నారు. శాశ్వత భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. విద్యార్థినులకు అన్ని వసతులు కల్పిస్తామని, ఉపాధ్యాయుల కొరత తీరుస్తామని చెప్పారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రానికి రూ.5 వేల కోట్లు

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రంలో వరద నష్టం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రకృతి విపత్తులతో ప్రజలు అల్లాడిపోతున్నారని, గత రెండు రోజులుగా కురిసిన కుండపోత వర్షాల కారణంగా రాష్ట్రంలో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. రైతులు పంటలను కోల్పోయారని పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు, గోదావరి జిల్లాల్లో వరద నష్టం దుఃఖాన్ని మిగిల్చిందని తెలిపారు. వందలాది కాలనీలు జలదిగ్బంధంలో ఉన్నాయన్నారు. ప్రకృతి విపత్తులతో జనం సాయం కోసం ఎదురుచూస్తున్నారని, ఈ తరుణంలో రాష్ట్రానికి కేంద్రం నిధులిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరద విపత్తును ఎదుర్కోవడంలో, సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం చూపిన చొరవ భేష్ అని ప్రశంసించారు.

పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో అపశృతి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (తిరుపతి జిల్లా)

పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం అనుప్పల్లిలో పవన్‌కల్యాణ్ బ్యానర్ కడుతుండగా జనసేన కార్యకర్తలు గోపి (32), మధు విద్యుత్తు షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. రుయాసుపత్రికి తరలిస్తుండగా గోపి మృతిచెందాడు. చికిత్స పొందుతున్న మధును తిరుపతి జనసేన ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ పరామర్శించారు.

30 నిమిషాల్లో శ్రీవారి దర్శనం

- వర్షాలు, వరదల వల్ల బోసిపోయిన తిరుమల

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

నిత్యం యాత్రికులతో రద్దీగా ఉండే తిరుమల బోసిపోయింది. మాఢవీధులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 32 వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్టుమెంట్లు వెలవెలబోతున్నాయి. 30 నిమిషాల్లో శ్రీవారిని యాత్రికులు దర్శించుకుంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ను వరదలు ముంచెత్తిన నేపథ్యంలో రవాణా రాకపోకలు స్తంభించాయి. తిరుమలకు ప్రతిరోజూ దాదాపు 80 లక్షలకుపైగా యాత్రికులు వస్తారని టిటిడి అంచనా. సెలవు దినాల్లో అయితే ఈ సంఖ్య లక్ష దాటుతుంది. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తుండడంతో పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు. తిరుపతికి వచ్చే 350 బస్సులు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో తిరుమలకు యాత్రికుల రాక తగ్గింది.


గండి పడిన పెదవాగు

పెద్దవాగుకు మళ్లీ గండి

కొట్టుకుపోయిన రింగ్‌బండ్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు జలాశయానికి సోమవారం మళ్లీ గండి పడింది. గతంలో కట్ట దెబ్బతిన్న ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రింగ్‌బండ్ 30 మీటర్ల మేర కొట్టుకుపోయింది. జులై 18న భారీ వరదలకు ఈ ప్రాజెక్టు కట్ట ధ్వంసం కావడంతోపాటు స్పిల్‌వే పక్కనే 250 మీటర్ల మేర గండి పడిన సంగతి తెలిసిందే. రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రూ.3.50 కోట్లతో ప్రభుత్వం రింగ్‌బండ్ నిర్మాణం చేపట్టింది. పనులు తుది దశకు చేరుకున్నాయి. కాగా, గత మూడు రోజులుగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు జలాశయంలోకి భారీగా వరద చేరింది. దానికితోడు సమీపంలోని చెరువులు, వాగులు పొంగిపొర్లడంతో పెద్దవాగు స్పిల్‌వే గేట్ల నుంచి నీరు ప్రవహించింది. నిర్మాణంలో ఉన్న రింగ్‌బండ్ పైనుంచి వరద ప్రవహించడంతో భారీ గండి పడింది. రింగ్‌బండ్ వద్ద పెద్దఎత్తున పేర్చిన ఇసుక బస్తాలూ కొట్టుకుపోయాయి. గండి కారణంగా సుమారు రూ.50 లక్షల నష్టం వాటిల్లిందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

తప్పుడు ప్రచారం తగదు

- టిడిపి నేత శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని టిడిపి రైతు విభాగం అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుంభవృష్టితో 11.37 లక్షల క్యూసెక్కుల నీటితో వందేళ్ల తరువాత వరద పోటెత్తిందన్నారు. ఈ వరదతో జనం ఇబ్బంది పడుతుంటే మరోవైపు అమరావతి మునిగిపోయిందంటూ జగన్ అబద్ధాలకు తెరలేపారన్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్దకు వరదలో కొట్టుకొచ్చిన బోట్లపై అనుమానం ఉందని అన్నారు. దీనిపై లోతైన విచారణ జరగాలని, ఎలాంటి కుట్ర కోణం ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చీకట్లో కూడా బుడమేరు వల్ల ముంపునకు గురైన డివిజన్‌లలో ప్రతివ్యక్తికీ మంచినీరు, ఆహారం అందేలా సిఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

నేడు, రేపు గ్రీవెన్స్ రద్దు : అశోక్‌బాబు

అకాల వర్షాలు, వరదలు కారణంగా మంగళ, బుధవారాల్లో టిడిపి కార్యాలయంలో జరగాల్సిన 'ప్రజావేదిక' (గ్రీవెన్స్) కార్యక్రమం రద్దయిందని పార్టీ కార్యాలయం కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు వెల్లడించారు. అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు వరద సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈ రెండు రోజుల్లో గ్రీవెన్స్ ఉండదని, ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు, ప్రజలు గమనించాలని కోరారు.

వరద ముంపులో లంక గ్రామాలు

- కొల్లూరు, భట్టిప్రోలులో 20 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కృష్ణానది ఉధృతి మరింతగా పెరగడంతో దిగువన ఉన్న బాపట్ల జిల్లా లంక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద ఉధృతి కారణంగా కొల్లూరు, భట్టిప్రోలు మండలాలలోని సుమారు 20 లంక గ్రామాలకు రోడ్డు మార్గం పూర్తిగా దెబ్బతిన్నది. ముగ్గురు డిఎస్‌పి, పది మంది సిఐలు, 20 మంది ఎస్‌ఐలు, సుమారు 400 మంది పోలీస్ సిబ్బందితో కృష్ణానది కరకట్ట పరివాహక ప్రాంతాలలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. భట్టిప్రోలు మండలం పెద్దపులివేరు వాగు కట్ట, వెల్లటూరు కాలువ తూముల వద్ద, కొల్లూరు మండలం కోటిపల్లి గ్రామం వద్ద కరకట్ట కోతకు గురికావడంతో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆయా ప్రాంతాల్లో ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి కట్టలను పటిష్టపరిచే చర్యలు తీసుకున్నారు. వరద బాధితుల కోసం 40 వేల మందికి సరిపడా ఆహార పొట్లాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిద్ధం చేయించి పంపిణీ చేశారు. వరద ప్రభావం ఎక్కువగా ఉన్న సిపిడిసిఎల్ పరిధిలో విద్యుత్తు సమస్యలను చక్కదిద్దేందుకు ఇపిడిసిఎల్ నుంచి 300 మంది, ఎస్‌పిడిసిఎల్ నుంచి 200 మంది టెక్నీషియన్లను రప్పించారు. వరద ప్రవాహం తగ్గిన వెంటనే సిబ్బందిని 200 టీములుగా రంగంలోకి దింపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.


భట్టిప్రోలు మండలం, వెల్లటూరు నుంచి లంకలకు ఆహార పదార్థాలు పడవలో తీసుకెళుతున్న అధికారులు


వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ఆర్‌కు జగన్, షర్మిల నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ కడప జిల్లా వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఘాట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పిసిసి చీఫ్ షర్మిల వేర్వేరుగా నివాళులర్పించారు. రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం జగన్ తన సతీమణి భారతి, తల్లి విజయమ్మతో కలిసి ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్ఆర్‌కు నివాళు లర్పించి భావోద్వేగానికి లోనయ్యారు. తమ తండ్రి వైఎస్ఆర్‌కు నివాళులర్పించేందుకు మూడు రోజుల పర్యటనలో భాగంగా జగన్ పులివెందులకు వచ్చారు. వైఎస్ఆర్‌కు నివాళులర్పించిన అనంతరం ఇడుపులపాయ నుంచి విజయవాడకు వెళ్లారు.

జగన్ ఇడుపులపాయి నుండి వెళ్లిపోయిన తర్వాత పిసిసి చీఫ్ షర్మిల తన తండ్రికి నివాళుర్పించేందుకు తల్లి విజయమ్మ, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డితో కలిసి ఘాట్ వద్దకు విచ్చేశారు. గంటపాటు వైఎస్ఆర్ ఘాట్ వద్ద షర్మిల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించి వైఎస్ఆర్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా షర్మిల విలేకరులతో మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరకాలం చెరగని సంతకం చేసిన గొప్పనేత వైఎస్ఆర్ అని, ఆయన లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిదని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని సిఎం చంద్రబాబు నాయుడు, వైసిపి అధినేత జగన్‌లు నీరుగార్చారని విమర్శించారు. విపత్తు ప్రభుత్వ నిర్లక్ష్యమనని తెలిపారు. విపత్తును ముందుగా అంచనా వేయడంతోపాటు ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.


నివాళులర్పిస్తున్న వైఎస్ షర్మిల

త్వరలో ఇద్దరు సిఎస్‌ల భేటీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

దీర్ఘకాలంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న ఆర్థిక అంశాలను పరిష్కరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు ప్రారంభించాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత అధికారులతో కీలక సమావేశాన్ని నిర్వహించగా, తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ దిశలో కసరత్తు చేస్తోంది. ఇరు రాష్ట్రాల సిఎస్‌లు, ఆర్థికశాఖ అధికారులు కలిసి ఉమ్మడి భేటీ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఏ రాష్ట్రానికి ఎంత నిధులు రావాల్సి ఉంటుందన్న వివరాలతోపాటు, ఏ రాష్ట్రానికి ఎంత ఇవ్వాల్సి ఉంటుందన్నదానిపైనా నివేదికలు సిద్ధం చేస్తున్నారు.ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ అంశంలో ఏ రాష్ట్రానికి ఎంత వాటా నిధులు రావాల్సి ఉంటుంది, ఎంత మంది డీలర్లు ఈ క్రెడిట్‌ను ఉపయోగించు కున్నారు అన్న వివరాలను ఆర్థికశాఖ, వాణిజ్య పన్నుల శాఖలు క్రోడీకరి స్తున్నాయి. ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం 295 కోట్ల రూపాయలు తమకు రావాల్సి ఉన్నట్లు చెబుతోంది. అలాగే మరోరూ. 208 కోట్ల వరకు నెట్ క్రెడిట్ కేరీడ్ ఫార్వర్డ్ ద్వారా పంపకాలు జరగాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. వీటికి సంబంధించి ఎంతమంది డీలర్లు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారన్నది కూడా లెక్కలు తేల్చే పనిలో రెండు రాష్ట్రాల అధికారులు ఉన్నారు. ఈ భేటీలో ప్రధానంగా నెట్ క్రెడిట్ కేరీడ్ ఫార్వర్డ్ నిధులపైనే ఎక్కువగా చర్చ సాగించాలని భావిస్తున్నారు. త్వరలోనే ఉమ్మడి రాష్ట్ర భేటీ తేదీలను కూడా ఖరారు చేయాలని ఉన్నతాధికారులను రాష్ట్ర సిఎస్ ఆదేశించారు.

అదానీ సంస్థలపై దర్యాప్తులో సెబీ చీఫ్ ప్రమేయం

- స్వయంగా పర్యవేక్షించిన మాధబి పురి
- బయటపెట్టిన సెబీ బోర్డు సభ్యుడు
- సుప్రీంకోర్టు తదుపరి చర్యపై ఉత్కంఠ



న్యూఢిల్లీ : అదానీ గ్రూపునపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి మార్కెట్ రెగ్యులేటర్ జరిపిన దర్యాప్తులో సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బుచ్ ప్రమేయం కల్పించుకున్నారు. షేర్ మార్కెట్‌లో తన వాటాల విలువను పెంచుకునేందుకు అదానీ గ్రూప్ ఆఫ్‌షోర్ సంస్థలను ఉపయోగించుకున్నారంటూ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సెబీ దర్యాప్తు జరిపింది. అదానీ గ్రూపు సంస్థల్లో మాధబి బచ్, ఆమె భర్త పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో నిస్పాక్షిక దర్యాప్తు జరిగేందుకు వీలుగా ఆ ప్రక్రియ నుండి ఆమె వైదొలిగారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై మోడీ సర్కార్ ఇప్పటి వరకూ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అదానీ గ్రూపునకు చెందిన ఓ ఆఫ్‌షోర్ సంస్థతో మాధబి బచ్‌కు సంబంధం ఉన్నదని హిండెన్‌బర్గ్ ఇటీవలే బయటపెట్టింది. సెబీ పనితీరును సమీక్షించే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా మాధబి బచ్ గురించి చెప్పేందుకు ఏమీ లేదని తేల్చేసింది. తనను తాను సమర్థించుకునేందుకు మాధబి చేసిన ప్రకటననే మంత్రిత్వ శాఖ ఉటంకించింది. అయితే అదానీ ఆఫ్‌షోర్ సంస్థలపై సెబీ జరిపిన దర్యాప్తు నుండి మీరు వైదొలిగారా లేదా, దర్యాప్తు సంస్థ నిబంధనల మేరకు నడుచుకున్నారా లేదా అంటూ నిర్దిష్టంగా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు ఆమె నిరాకరించారు.

దొంగ చేతికే తాళం

'సెబీ దర్యాప్తు నుండి మాధబి బచ్ వైదొలగలేదని సెబీ బోర్డు సభ్యుడొకరు ఆన్‌లైన్ వార్తా వేదిక 'స్క్రోల్'కు ఓ సంచలన విషయాన్ని బహిర్గతం చేశారు. దీంతో చేదునిజం బయటపడింది. అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన సెబీ చీఫ్ నేతృత్వంలోనే ఆరోపణలపై దర్యాప్తు జరిపారు. అంటే దొంగ చేతికే తాళం ఇచ్చారన్న మాట. అదానీ గ్రూపునపై వచ్చిన అక్రమాల ఆరోపణలపై జరిగిన దర్యాప్తులో మాధబి బచ్ తనకు తానుగా వైదొలిగారని ఇటీవల సెబీ తెలిపింది. దర్యాప్తు నుండి మాధబి బచ్ వైదొగలేదని బోర్డు సభ్యుడు స్పష్టం చేయడంతో ప్రజలకు, మార్కెట్‌కు ఆమె వాస్తవాన్ని వెల్లడించకుండా దాచిపెడుతున్నారని అర్థమవుతోంది. సెబీ రికార్డులను పరిశీలించినప్పుడు ఆ సభ్యుడు చెప్పింది నిజమని తేలితే అప్పుడు సుప్రీంకోర్టు సెబీ మాజీ అధిపతులతో, అధికారులతో మరో స్వతంత్ర కమిటీని నియమించవచ్చు.

ఇప్పటికీ ఐసిఐసిఐ బ్యాంక్ నుంచి ఆదాయం

సెబీ చీఫ్ మాధబి పురి బచ్‌పై హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ చేసిన ఆరోపణల వేడి చల్లారక ముందే కాంగ్రెస్ పార్టీ తాజాగా బాంబు పేల్చింది. సెబీ హోల్‌టైమ్ సభ్యురాలిగా వ్యవహరిస్తూనే మాధబి బచ్ తాను గతంలో పనిచేసిన ఐసిఐసిఐ బ్యాంక్ నుండి ఇప్పటికీ ఆదాయాలు పొందుతున్నారు. 2017-2024 మధ్యకాలంలో రూ.16.8 కోట్ల మేర జీతం, ఆదాయం పొందారని ఆరోపించింది. సెబీ సభ్యురాలిగా ఉంటూ ఐసిఐసిఐ వంటి ప్రైవేటు సంస్థ నుండి ఎలా జీతం తీసుకుంటారని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖెరా సోమవారం విలేకరులతో అన్నారు. 'మాధబి బచ్ 2017-24 మధ్య సెబీ హోల్‌టైమ్ సభ్యురాలిగా ఉన్నారు. ఆ కాలంలో ఆమె రూ.16.80 కోట్ల మేర ఐసిఐసిఐ బ్యాంక్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ నుండి ఆదాయాన్ని, బ్యాంక్ నుండి ఎంప్లాయి స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్స్ (ఎసోప్) ప్రయోజనాలను పొందారు' అని తెలిపారు.

సెబీ జరుపుతున్న దర్యాప్తులో దాని అధిపతికి పరస్పర విరుద్ధ ప్రయోజనాలు చేకూరడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. 'ఈ ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం చాలా తేలికగా కొట్టిపారేసింది. కానీ ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వచ్చిన వాస్తవాలు చట్టవిరుద్ధ కార్యకలాపాల బాగోతాన్ని బయటపెట్టాయి' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. సెబీ పదవిలో ఉంటూ ప్రైవేటు బ్యాంక్ నుండి ఆర్థిక ప్రయోజనాలు పొందడం దర్యాప్తు సంస్థ సెక్షన్ 54ను ఉల్లంఘించడమే అవుతుందని, కాబట్టి బచ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 2017-18లో బచ్ రూ.2 కోట్ల జీతం తీసుకున్నారని, ఆ మరుసటి ఆర్థిక సంవత్సరంలోనే అది రెట్టింపై రూ.4.71 కోట్లకు చేరిందని కాంగ్రెస్ గుర్తు చేసింది. '2017లో బచ్ సెబీలో చేరారు. అప్పటి నుండి నేటి వరకూ ఐసిఐసిఐ నుండి ఆమె రూ.16,80,22,143ల ఆదాయాన్ని పొందారు. అదే కాలంలో సెబీ నుండి పొందిన రూ.3,30,28,246ల ఆదాయంతో పోలిస్తే ఇది 5.09 రెట్లు అదనం' అని కాంగ్రెస్ ఓ ప్రకటనలో వివరించింది.

బెర్ముడా, మారిషస్‌లోని అదానీ గ్రూప్ డొల్ల కంపెనీల్లో మాధబీ దంపతులకు వాటాలున్నట్టు ఇటీవల హిండెన్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆ కంపెనీల్లో వారిద్దరూ కోటి డాలర్ల మేరకు పెట్టుబడులు పెట్టినట్టు తెలిపింది. అదానీల ఆర్థిక అవకతవకల్లో ఏకంగా సెబీ చైర్‌పర్సన్ భాగస్వామి కావడం తీవ్ర విమర్శలకు దారి తీస్తున్న ప్రస్తుత సమయంలో ఆమె ఐసిఐసిఐలో ఆదాయాలు పొందడం, అదానీ కేసుల దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించడం విషయాలు బయటికి రావడం పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి.

సంపాదకీయం

ఆదుకోవాలి

బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం, అదే సమయంలో అరేబియా సముద్రంలో లేచిన తుపాన్ ప్రభావానికి కదులుతున్న రుతుపవన ద్రోణి రెండూ కలిసి తెలుగు రాష్ట్రాల్లో సృష్టించిన బీభత్సం మాటలకందనిది. ప్రధానంగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలు జల ప్రళయం బారిన పడి చిగురుటాకులా వణుకుతున్నాయి. విజయవాడ, గుంటూరు, ఏలూరు నగరాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు, చెరువులు ఏకమయ్యాయి. జన జీవనం స్తంభించింది. రోడ్లకు, కాల్వలకు, చెరువులకు గండ్లు పడ్డాయి. హైవేలపైకి వరద నీరు ఉప్పొంగడంతో రవాణా నిలిచిపోయింది. రైళ్లు, బస్సులు, విమానాలు రద్దయ్యాయి. పలు నగరాలు, పట్టణాలు, పల్లెలు భయం గుప్పెట్లో గడుపుతున్నాయి. లక్షల ఎకరాల్లో పంటలు నీటి పాలయ్యాయి. మరీ ముఖ్యంగా బెజవాడ బాధ ఎంత చెప్పినా తక్కువే. రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. మర పడవలే జనాలకు దిక్కయ్యాయి. ఆహారం అందక, తాగు నీరు దొరక్క, చివరికి పసిపిల్లలకు గుక్కెడు పాలు కరువై అలమటిస్తున్న హృదయ విదారక దృశ్యాలు ఎంతటి వారి మనసులైనా తరుక్కుపోతాయి. లక్షల మంది ప్రజలు ముంపులో చిక్కుకొని ఎటూ వెళ్లే దారి లేక తమను రక్షించే వారి కోసం గంటల కొలది ఎదురు చూస్తున్న దయనీయ పరిస్థితి.

భారీ వర్షాలు, వరదలకు ఇప్పటి వరకు 19 మంది మృత్యువాత పడ్డారన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాథమిక లెక్క. గల్లంతై ఆచూకీ దొరకని వారి సంఖ్య ఉండనే ఉంది. ఒక్క విజయవాడలోనే కొండ చరియలు విరిగిపడి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం విషాదం. రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితుల సహాయంపై ప్రకటన చేసింది. మృతుల కుటుంబాలకు కొంత ఎక్స్‌గ్రేషియో, ముంపు బాధితులకు కొద్దిపాటి నిత్యావసర వస్తువులు, దుస్తులు, ఆహార పొట్లాలు, నీటి ప్యాకెట్ల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. ముంపులో చిక్కుకున్న వారి కోసం హెలికాప్టర్లను, మర పడవలను వినియోగిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా విజయవాడలో వరద ప్రాంతాలను సందర్శించి బాధితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాల కారణంగా కృష్ణానది పోటెత్తడంతో ప్రకాశం బ్యారేజికి గరిష్టంగా 12 లక్షల క్యూసెక్కుల వరకు నీరు వస్తుందని అంచనా వేశారు. దాంతో నదికి అటూ ఇటూ ఉన్న ప్రజలు, లంక గ్రామాల వాసులు బిక్కుబిక్కుమంటున్నారు. వేలాది మంది ఇళ్లూ వాకిళ్లు వదిలేసి కట్టుబట్టలతో సహాయ శిబిరాల్లో తల దాచుకుంటున్నారు. సెప్టెంబర్‌లో బంగాళాఖాతంలో మరిన్ని అల్ప పీడనాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు భీతిల్లుతున్నారు.

ప్రస్తుత విలయ తీవ్రత ఇటీవలి కాలంలో ఎన్నడూ చూడనిదిగా అనుభవజ్ఞుల, సీనియర్ సిటిజన్ల మాటలు ఆలోచింపదగినవి. వాతావరణ మార్పులు, విచ్చలవిడి ప్రకృతి విధ్వంసం, పర్యావరణ సమతుల్యం కాపాడటంపై పాలకులు దృష్టి నిలపాలని హెచ్చరిస్తున్నాయి. కొన్ని గంటల్లో 20, 30 సెంటీమీటర్ల వాన గతంలో ఎప్పుడూ ఎరగం. నీటి వనరుల నిర్వహణలో ప్రభుత్వాల వైఫల్యం ఆకస్మిక వరదలకు హేతువు. బెజవాడ ఇంతగా మునగడానికి బుడమేరు కారణం. బుడమేరు అంశం ఇప్పటిది కాదు. దశాబ్దాలుగా ప్రభుత్వాల నిర్లక్ష్యం ఇక్కడే కనిపిస్తుంది. పద్ధతీపాడూ లేని విశృంఖల పట్టణీకరణ, విచ్చలవిడి దురాక్రమణలు, రియల్ దందా ఎవరు ప్రభుత్వంలో ఉన్నా ఆగింది లేదు. వీటిని అరికడితేనే ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలకు రక్షణ. వరదలను జాతీయ విపత్తుగా సిఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. కేంద్రంతో మాట్లాడి జాతీయ విపత్తుగా ప్రకటింపజేయాలి. ప్రధాని సైతం మాటామంతితో సరిపెట్టకుండా రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధులిచ్చి ఆదుకోవాలి. అప్పటిదాకా ఆగకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వరద బాధితులకు ఆపన్న హస్తం అందించాలి. వర్షాలు వరదల వరలన పంటలు నష్టపోయిన రైతులకు సముచిత స్థాయిలో నష్టపరిహారం అందించాలి. వరద బాధిత ప్రాంతాల్లో తాత్కాలిక, శాశ్వత పునరావాస చర్యలు చేపట్టాలి. విపత్తుల సమయంలో అధికార ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సబబు కాదు. అందరూ కలిసి ప్రజలు సాధారణ జీవనం సాగించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించి మానవత్వం చాటుకోవాలి.

మహనీయుల మాట




**విప్లవ పథంలో పయనించే వీరయోధులు,
ప్రతి పరాజయం నుంచీ కొత్త శక్తిని
కూడగట్టుకుంటారు.
చరిత్ర ప్రవాహంలో ఎంతగా ఈదులాడితే,
మనోధైర్యం అంతగా పెరుగుతుంది.**

- కార్ల్ మార్క్స్

Karl Marx


ఏకపక్ష ఆంక్షలు నేరం

ఈ మధ్య ప్రధాని మోడీ ఉక్రెయిన్ పర్యటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎందుకు ఈ పర్యటన తలపెట్టారన్నది ఒక నిగూఢ రహస్యమే. రష్యా నుండి ఎవరూ చమురు కొనుగోలు చేయరాదంటూ సామ్రాజ్యవాద దేశాలు విధించిన ఆంక్షలను పక్కన పెట్టి భారతదేశం ఇంతవరకూ రష్యా నుండి ముడి చమురు, సహజ వాయువు కొనుగోలు చేస్తోంది. ఈ పర్యటన సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ రష్యా నుండి ముడి చమురు కొనుగోలు చేయవద్దని, సామ్రాజ్యవాద దేశాల ఆంక్షలకు అనుగుణంగా వ్యవహరించాలని మోడీని కోరారు. ఇలా మన ప్రధానిని కోరుతున్న వ్యక్తి ఎటువంటివాడు? రెండో ప్రపంచ యుద్ధంలో (అప్పుడు ఉక్రెయిన్ సోవియట్ రష్యాలో అంతర్భాగం) నాజీ జర్మనీకి ఏజంటుగా వ్యవహరించి స్వంత దేశానికే ద్రోహం తలపెట్టిన స్టెపాన్ బండెరా వంటి పరమ నీచుల మద్దతుతో ఉక్రెయిన్‌ను అతగాడు పాలిస్తున్నాడు. పోనీ, ఆ సంగతి పక్కన పెడదాం. బుష్ హయాంలో గోర్బచేవ్‌తో కుదిరిన అంగీకారం ప్రకారం నాటో తూర్పు వైపుగా, అంటే రష్యా వైపుగా విస్తరించకూడదు. అదే మాదిరిగా ఉక్రెయిన్ విడిపోయినప్పుడు రష్యా-ఉక్రెయిన్ దేశాల నడుమ మిన్స్క్ ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందాన్ని ఉక్రెయిన్ ఏకపక్షంగా ఉల్లంఘించింది. బ్రిటన్, అమెరికా దేశాలు ఉక్రెయిన్‌లో తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఆ ప్రభుత్వం ద్వారా ఈ ఉల్లంఘన జరిగేట్టు చేశాయి. ఆ ఒప్పందానికే గనుక ఉక్రెయిన్ కట్టుబడి వుంటే ఈ యుద్ధమే జరిగేది కాదు. పోనీ, ఆ విషయాన్నీ పక్కన పెడదాం. భారతదేశం తన స్వప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తోంది. తద్వారా మన దేశం సామ్రాజ్యవాదులు విధించిన ఆంక్షలను పక్కన పెట్టినట్టయింది. దీనినీ పక్కన పెడదాం. అసలు ఈ "ఏకపక్ష" ఆంక్షలకు ఉన్న నైతికత ఏమిటో చర్చిద్దాం.



ప్రభాత్ పట్నాయక్

పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు తమ ఆదేశాలను ఖాతరు చేయని దేశాలపై విధించే ఆంక్షలనే మనం ఇక్కడ ఏకపక్ష ఆంక్షలు అంటున్నాం. వీటికి ఐక్యరాజ్యసమితి ఆమోదం ఎంత మాత్రమూ లేదు. అన్ని దేశాలకూ ఉమ్మడి వేదికగా ఉన్న ఐరాస ఆమోదంతో ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా ఆంక్షలు విధిస్తే వాటి సంగతి వేరు. అప్పుడు ప్రపంచ ప్రయోజనాలు మొత్తంగా పరిగణనలోకి తీసుకునే వీలుంటుంది. కాని ఈ ఏకపక్ష ఆంక్షలు వేరు. సామ్రాజ్యవాద దేశాల ఆదేశాలను వ్యతిరేకించినందుకు క్యూబా నుంచి వెనిజులా వరకు, సిరియా నుండి లిబియా వరకు పలు దేశాలు ఈ విధమైన ఏకపక్ష ఆంక్షలకు లోనుకావలసి వచ్చింది. ఈ ఏకపక్ష ఆంక్షలకు అనుగుణంగా నడుచుకోవడం అంటే మన దేశం కూడా సామ్రాజ్యవాద దేశాల దూకుడుకు, దానిలో భాగంగా అమలు చేసే కుట్రలకు ఆమోదం వేసినట్టే అవుతుంది.



ఈ ఏకపక్ష ఆంక్షలకుండే ప్రత్యేక లక్షణం: అవి ప్రజలను దెబ్బ తీస్తాయి. నిజంగానే ఈ తరహా ఆంక్షలు ప్రజలను దెబ్బ తీయడానికే ఉద్దేశించబడినటువంటివి. ఎంత బలంగా అవి ప్రజలను దెబ్బ తీస్తాయో అంత బాగా ఈ ఆంక్షలు అమలు జరిగినట్టు లెక్క. యుద్ధ సమయంలో సాధారణ పౌరుల మీద బాంబు దాడులు చేయకూడదు. కాని కొన్ని సార్లు బాంబు దాడులు జరుగుతూంటాయి (ప్రస్తుతం గాజాలో మాదిరిగా). అప్పుడు సాధారణ ప్రజానీకాన్ని మూకుమ్మడిగా శిక్షించడానికి పూనుకున్నట్టే లెక్క. అదే మాదిరిగా ఈ ఆంక్షలు కూడా సామాన్య ప్రజలను, వారు చేసిన నేరం ఏమీ లేకపోయినా, శిక్షిస్తాయి. నాల్గవ జెనీవా సదస్సు తీర్మానం లోని 33వ అధికరణం ప్రకారం ఆ విధంగా చేయడం యుద్ధ నేరంగా పరిగణించబడుతుంది. అదే మోతాదు ప్రభావాన్ని ప్రజల మీద కలిగించే ఆంక్షలు కూడా యుద్ధ నేరంతో సమానమే.

> **ఈ ఏకపక్ష ఆంక్షలకు అనుగుణంగా నడుచుకోవడం అంటే మన దేశం కూడా సామ్రాజ్యవాద దేశాల దూకుడుకు, దానిలో భాగంగా అమలు చేసే కుట్రలకు ఆమోదం వేసినట్టే అవుతుంది.**

> **ఈ ఆంక్షలు కూడా సామాన్య ప్రజలను...వారు చేసిన నేరం ఏమీ లేకపోయినా, శిక్షిస్తాయి. నాల్గవ జెనీవా సదస్సు తీర్మానం లోని 33వ అధికరణం ప్రకారం ఆ విధంగా చేయడం యుద్ధ నేరంగా పరిగణించబడుతుంది. అదే మోతాదు ప్రభావాన్ని ప్రజల మీద కలిగించే ఆంక్షలు కూడా యుద్ధ నేరంతో సమానమే. ఇప్పుడు జెలెన్‌స్కీ ఆ నేరాన్నే చేయమని మన దేశాన్ని మోడీ ద్వారా అడుగుతున్నాడు! ఈ ఆంక్షలు రష్యా దేశ ప్రజలను ఎంతవరకూ దెబ్బ తీశాయన్నది ఇక్కడ అప్రస్తుతం. ఆంక్షల వెనుక లక్ష్యమే ఇక్కడ ప్రధానం. ఆ లక్ష్యం యుద్ధ నేరానికి పాల్పడిన దానితో సమానం.**

ఇప్పుడు జెలెన్‌స్కీ ఆ నేరాన్నే చేయమని మన దేశాన్ని మోడీ ద్వారా అడుగుతున్నాడు! ఈ ఆంక్షలు రష్యా దేశ ప్రజలను ఎంత వరకూ దెబ్బ తీశాయన్నది ఇక్కడ అప్రస్తుతం. ఆంక్షల వెనుక లక్ష్యమే ఇక్కడ ప్రధానం. ఆ లక్ష్యం యుద్ధ నేరానికి పాల్పడిన దానితో సమానం.

ఆ దేశం తప్పు చేసింది కాబట్టే మేం ఆంక్షలు విధించాం అంటున్నది సామ్రాజ్యవాదం. తమ చర్యను ఈ విధంగా సమర్ధించుకోవడం వెనుక న్యాయబద్ధత ఏమీ లేదు. ఆంక్షలకు గురైన దేశంలోని ప్రభుత్వం ఆ దేశపు ప్రజానీకపు మద్దతుతో నడిచేదే ఐతే, అప్పుడు ఈ ఆంక్షలు ఒక ప్రజామోదం పొందిన ప్రభుత్వపు సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీసినట్టు అవుతుంది. వారిని సమిష్టిగా శిక్షించినట్టు అవుతుంది. అందుచేత ఇది సామాన్య పౌరులను బాంబు దాడులతో మూకుమ్మడిగా చంపడం వంటి యుద్ధ నేరంతో సమానమే.

నిజానికి ఈ ఆంక్షల ప్రభావం పౌరుల మీద జరిపే బాంబు దాడులు కలిగించే ప్రభావం కన్నా ఎక్కువ. బాంబు దాడులు ఎటువంటి మిలిటరీ లక్ష్యమూ లేకుండా, సామాన్య పౌరుల మీద జరుగుతాయి. ఐతే వాటి ప్రభావం ఆ దాడులు జరిగిన ప్రాంతం మీదనే పడుతుంది. కాని ఆంక్షల ప్రభావం ఒక దేశ ప్రజానీకం మొత్తం మీద పడుతుంది. బాంబు దాడుల నుండి తప్పించుకోడానికి వేరే ప్రదేశానికి తరలిపోవచ్చు. కాని ఆ దేశంలో ఎక్కడినుంచి ఎక్కడికి తరలిపోయినా, ఆంక్షల నుండి తప్పించుకోలేం. రెండవది: బాంబు దాడులు కొద్ది పరిమిత కాలం పాటే సాగుతాయి. కాని ఈ ఆంక్షలు అలా నిరవధికంగా కొనసాగుతూనే వుంటాయి. క్యూబానే తీసుకోండి. ఆ దేశం మీద ఆంక్షలు కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ఇరాన్ మీద కూడా అదే విధంగా కొనసాగుతున్నాయి. మూడవది: బాంబు దాడులవలన సంభవించే మరణాల కన్నా ఆంక్షల వలన మరణించేవారు ఎక్కువగా ఉంటారు. ఆంక్షలకు గురయ్యే దేశాల ప్రజానీకానికి ఆహారం, ఔషధాలు సరఫరా జరగకుండా నిషేధించినందు వలన జరిగే మరణాలు చాలా ఎక్కువ. ఇప్పటి దాకా ఆంక్షలకు గురైన దేశాలన్నీ దాదాపుగా ఆహార కొరతను, ఔషధాల కొరతను చవి చూశాయి. నాలుగవది: ఈ కారణంగానే ఆంక్షలు ప్రత్యేకించి వృద్ధుల మీద, చిన్న పిల్లల మీద, గర్భవతుల మీద ఎక్కువ హానికర ప్రభావాన్ని చూపిస్తాయి. మామూలుగా యుద్ధ సమయాల్లో ఈ తరగతుల ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకోకూడదు. కాని ఈ ఆంక్షలు వారినే ముఖ్య లక్ష్యంగా చేసుకుంటాయి.

ఈ విధంగా ఆంక్షలకు గురయ్యే దేశాలలో ఆ ఆంక్షలను తట్టుకుని నిలబడి తమ ప్రజానీకానికి కావలసిన ఆహారాన్ని, ఔషధాలను, ఇతర అవసరాలను అందించడానికి పూనుకునే సత్తా ఉన్నవి కొన్ని ఉండవచ్చు. కాని వాటిని వేరే ఇతర మార్గాల్లో సేకరించవలసి వస్తుంది. అప్పుడు దాని ఫలితంగా ఆ దేశాలలో ద్రవ్యోల్బణం బాగా పెరిగిపోతుంది. అప్పుడు ఆ ఆహారం గాని, ఔషధాలు గాని చాలా మందికి అందుబాటులో లేకుండా పోతాయి. ఈ విధంగా ధరలు పెరగడానికి రెండు కారణాలు ఉంటాయి. మొదటిది: ప్రజలందరి అవసరాలనూ తీర్చగలిగేంతగా ఆ అత్యవసర సరుకులను అందించడం ఆంక్షల నేపథ్యంలో సాధ్యపడదు. అందుచేత వాటికి కొరత ఏర్పడి, ధరలు పెరుగుతాయి. రెండవది: ఆంక్షల ఫలితంగా ఆ దేశపు కరెన్సీ మారకపు రేటు పడిపోతుంది. అప్పుడు దిగుమతులకు చెల్లించే విదేశీ మారకపు ద్రవ్యం విలువ పెరుగుతుంది. దాని ఫలితంగా ధరలు పెరుగుతాయి. పైగా, ఆ దేశంలోకి విదేశీ పెట్టుబడుల రాక దాదాపు నిలిచిపోతుంది. దానివలన కూడా విదేశీ మారకపు ద్రవ్యం లోటు పెరుగుతుంది. పైగా ఆ దేశపు విదేశీ మారకపు నిల్వలు ఏదైనా విదేశీ బ్యాంకుల్లో దాచి వుంటే ఆ బ్యాంకులు ఈ ఆంక్షల కారణంగా ఆ ఖాతాలను స్తంభింపజేస్తాయి. అందుచేత కొన్ని మిత్ర దేశాలు తోడుగా నిలిచినప్పటికీ, ఆంక్షలు ఆ దేశ ఆర్థిక వ్యవస్థను, ముఖ్యంగా సామాన్య ప్రజానీకాన్ని దారుణంగా దెబ్బ తీస్తాయి.

దీనిని బట్టి ఆంక్షలు విధించడం అంటే అది ప్రచ్ఛన్న యుద్ధం సాగించడమే. అంతే కాదు, ప్రత్యక్ష యుద్ధం కన్నా ఎక్కువ ప్రమాదకరం. కాని పైకి అలా కనపడదు. ఆంక్షల ఫలితంగా ఆస్పత్రులలో అవసరమైన ఔషధాలు లభించక మరణించేవారి సంఖ్య పెరిగిపోతుంది. సరైన తిండి లేక మరణించేవారి సంఖ్య పెరుగుతుంది. లేదా, జబ్బుల పాలయ్యేవారి సంఖ్య పెరిగిపోతుంది. కాని ఈ ప్రభావం యుద్ధంలో బాంబు దాడుల వలన మరణాలు సంభవించినట్టుగా కొట్టొచ్చినట్టు కనిపించదు.

ఈ పరిస్థితులన్నీ ఇప్పుడు రష్యాలో నెలకొన్నాయని చెప్పలేం. రష్యా ఈ ఆంక్షలను తట్టుకోగలుగుతోంది. సోవియట్ యూనియన్ కాలం నుండీ అందివచ్చిన వారసత్వంగా రష్యాకు అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ ఉంది. నిజానికి సామ్రాజ్యవాద దేశాలు ఒక అభివృద్ధి చెందిన దేశం మీద ఆంక్షలు విధించినది తొలిసారిగా రష్యా పైనే. బలహీనంగా ఉండే మూడవ ప్రపంచ దేశాల కన్నా రష్యా ఈ ఆంక్షలను తట్టుకోగలుగుతోంది. పైగా ఏక కాలంలో పలు దేశాల మీద ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీని వలన ఆ ఆంక్షల ప్రభావం పలుచనైపోతోంది.

ఐతే, ఈ కారణాల రీత్యా ఆంక్షలను తక్కువ చేసి చూడనక్కరలేదు. ఈ ఆంక్షలు మూడవ ప్రపంచ దేశాల ప్రజల మీద ప్రయోగించడానికి సామ్రాజ్యవాదులు సిద్ధం చేసి వుంచుకున్న ఒక అత్యంత ప్రమాదకర ఆయుధం. ఈ విధంగా ఏకపక్షంగా ఆంక్షలను విధించడాన్ని ఐరాస నిషేధించాల్సిందే. ఐతే, అటువంటి నిషేధాలేవీ ఐరాస భద్రతా మండలి ఆమోదం లేకుండా అమలులోకి రావన్నది తెలిసినదే. ఐనప్పటికీ, ఐరాస ఆంక్షలను నిషేధించడం అనేది ఒక నైతిక బలాన్ని బాధిత దేశాలకు సమకూరుస్తుంది.

భారత దేశాన్ని రష్యా మీద జరిగే ఆర్థిక యుద్ధంలో చురుకైన భాగస్వామిగా మార్చాలన్నదే జెలెన్‌స్కీ ప్రతిపాదన సారాంశం. ఇది యుద్ధ నేరానికి తోడుపడడం కన్నా తక్కువేమీ కాదు.

(స్వేచ్ఛానుసరణ)

వ్యాఖ్య

ఓ.పి.ఎస్ మాత్రమే న్యాయమైనది

కేంద్ర ప్రభుత్వం యు.పి.ఎస్ పథకం గురించిన వివరాలను కొద్దికొద్దిగా బయట పెడుతోంది. మొత్తం పథకం వివరాలు ప్రకటించినప్పుడు మాత్రమే అందులోని కుట్రను బహిర్గతం చేయగలం. యు.పి.ఎస్ పథకం 31.3.2025 తేదీన, ఆ తరువాత పదవీ విరమణ చేసే ఉద్యోగులకు వర్తిస్తుంది. 1.4.2025 నుండీ అమలు చేస్తారు. ఎన్.పి.ఎస్ పథకంలో సిబ్బంది వేతనం నుండి 10 శాతం రికవరీ చేస్తారు. పెన్షన్ ఫండ్‌కు ప్రభుత్వం 14 శాతం చెల్లిస్తుంది. ఈ మొత్తం పెన్షన్ ఫండ్ షేర్ మార్కెట్‌లో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడతారు. అందులో వచ్చే లాభాలు కూడా పెన్షన్ ఫండ్‌కు జమ చేస్తారు. పదవీ విరమణ చేసే సమయంలో ఈ ఫండ్ నుండి ఉద్యోగి 60 శాతం తీసుకోవచ్చు. మిగిలిన 40 శాతం మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టి అందులో వచ్చే లాభాల్లో నుంచి పెన్షన్ ఇస్తారు. పెన్షనర్, జీవిత భాగస్వామి ఇద్దరూ మరణించిన తరువాత 40 శాతం పైకం వారసులకు చెల్లిస్తారు.

యు.పి.ఎస్ పథకంలో వేతనం నుండి 10 శాతం రికవరీ కొనసాగుతుంది. ప్రభుత్వం 18.5 శాతం చెల్లిస్తుంది. అంటే మొత్తం 28.5 శాతం పైకం పెన్షన్ ఫండ్‌కు జమ చేయాలి కదా. కానీ 10 ప్లస్ 10, 20 శాతం మాత్రమే ఫండ్‌కు జమ చేస్తారట. మిగిలిన 8.5 శాతంతో ప్రభుత్వం ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేస్తుందట. మార్కెట్ పెట్టుబడుల్లో లాభాలు తగ్గితే అందులోంచి బదిలీ చేస్తారట. ఉద్యోగి పెన్షన్ ఫండ్ అకౌంట్‌లో ఉన్న మొత్తం పైకం ప్రభుత్వం తీసుకుని, పెన్షనర్‌కు గ్యారెంటీ పెన్షన్, అనంతరం జీవిత భాగస్వామికి గ్యారంటీ ఫ్యామిలీ పెన్షన్ అమలు చేస్తారట. ఇరువురి మరణం తరువాత మిగిలిన 40 శాతం వారసులకు ఇవ్వరట. ప్రభుత్వ ఖాతా లోకి వెళ్లిపోతుంది. ఉద్యోగికి 25 సంవత్సరాల సర్వీస్ వుంటే అతని పెన్షన్ ఫండ్‌లో వుండే మొత్తం సొమ్ము ప్రభుత్వం తీసుకోవడానికి అతడు అంగీకరిస్తే, అతడి పదవీ విరమణకు ముందు చివరి 12 నెలల సరాసరి బేసిక్ వేతనంలో 50 శాతం గ్యారెంటీ పెన్షన్ ఇస్తారు. ఓ.పి.ఎస్ పథకంలో 10 సంవత్సరాల సర్వీస్ వుంటే చాలు. సర్వీస్ చివరి నెల మూల వేతనంలో 50 శాతం గ్యారెంటీ పెన్షన్ అమలులో వుంది.



ఆర్. ఇలాంగోవన్

ఎన్.పి.ఎస్ పథకంలో రికవరీ చేసే 24 శాతంలో 60 శాతం పదవీ విరమణ సమయంలో తీసుకునే వెసులుబాటు ఉంది కదా. యు.పి.ఎస్ పథకంలో 20 శాతంలో మాత్రమే 60 శాతం పొందే వీలు వుంటుంది. అంటే ఫండ్ నుండి 60 శాతం తీసేసుకుంటే 40 శాతం మాత్రమే పెన్షన్ లభిస్తుంది. ఎన్.పి.ఎస్ పథకంలో 50 శాతం పెన్షన్ వుండదు. గ్యారెంటీ లేదు.

పాతిక సంవత్సరాల సర్వీస్ వుంటే 50 శాతం పెన్షన్ లభిస్తుంది. ఇరవై సంవత్సరాల సర్వీస్ వుంటే ఆ మేరకు పెన్షన్ తగ్గిస్తారు. అంటే 40 శాతం మాత్రమే పెన్షన్ వుంటుంది. పది సంవత్సరాల సర్వీస్ వుంటే మూల వేతనంలో 20 శాతం మాత్రమే పెన్షన్ వస్తుంది. కనీస పెన్షన్ 10 వేలు వుంటుంది. ఓ.పి.ఎస్ పథకంలో కనీస పెన్షన్ రూ.9000.



కుటుంబ పెన్షన్

యు.పి.ఎస్, ఎన్.పి.ఎస్ పథకంలో ఫ్యామిలీ పెన్షన్ జీవిత భాగస్వామి వరకే పరిమితం. పెన్షన్ పైకంలో 60 శాతం పెన్షన్ ఫ్యామిలీ పెన్షన్ కింద చెల్లిస్తారు. పెన్షన్ రూ.50,000 అయితే ఫ్యామిలీ పెన్షన్ రూ.50,000లో 60 శాతం రూ.30,000. పెన్షన్ రూ.10,000 అయితే కుటుంబ పెన్షన్ రూ.60 శాతం అంటే రూ.6000. కనీస పెన్షన్ రూ.10,000 కుటుంబ పెన్షన్‌కు వర్తించదు.

ఓ.పి.ఎస్ పథకంలో పెన్షనర్ మరణిస్తే పదవీ విరమణ చేసిన 7 సంవత్సరాలు లేక ఉద్యోగికి 67 సంవత్సరాలు వచ్చే వరకు, ఏది ముందయితే ఆ తేదీ వరకు, చివరి నెల వేతనంలో 50 శాతం పెన్షన్ చెల్లిస్తారు. ఆ తరువాత 30 శాతం కుటుంబ పెన్షన్ చెల్లించాలి.

కనీస కుటుంబ పెన్షన్ రూ.9000. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యం లెక్కలు తీసుకుంటే 1.4.2025 నాటికి 57 శాతం కరువు భత్యం కలుపుకుంటే రూ.14,130 ఇవ్వవలసి వుంటుంది. పెన్షనర్, జీవిత భాగస్వామి కూడా మరణించిన పక్షంలో వారిపై ఆధారపడిన వితంతువు కుమార్తె, విడాకులు పొందిన కుమార్తె, వికలాంగుడైన కుమారుడు, వీరిలో ఒకరికి జీవితాంతం, కుమార్తె పునర్వివాహం వరకు కుటుంబ పెన్షన్ చెల్లిస్తారు. యు.పి.ఎస్, ఎన్.పి.ఎస్ పథకాల్లో ఈ ప్రస్తావనే లేదు. భార్య, భర్తకే పరిమితం.

కరువు భత్యం

ఓ.పి.ఎస్ పథకంలో వుంది. ఎన్.పి.ఎస్ లో లేదు. యు.పి.ఎస్ పథకంలో చేర్చారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2016 నుండి ప్రస్తుత కరువు భత్యం లెక్కిస్తున్నారు. 1.4.2025 నాటికి 57 శాతం కరువు భత్యం పెన్షన్‌తో కలిపి ఇస్తారా అన్నది పెద్ద సందేహం. 1.4.2025 నాటికి డి.ఎ లెక్కలు తీయడానికి మరో కొత్త ప్రాతిపదిక తయారు చేసి జీరో నుండి డి.ఎ లెక్కలు ప్రారంభించే అపాయం పొంచి వుంది. లేకుంటే కనీస పెన్షన్ 9000 నుండి యు.పి.ఎస్ లో రూ.10,000 చేసే ప్రతిపాదన ఎలా వచ్చినట్టు? సోమనాథన్ కమిటీ కనికట్టు కాదు కదా! ఇదే జరిగితే 1.4.2025 నుండి అమలయ్యే యు.పి.ఎస్ పథకంలో కరువు భత్యం గురించిన ప్రస్తావన వుండకపోవచ్చు. పెన్షన్ మాత్రమే చెల్లించవచ్చు. మనం ఎదురు చూస్తున్న 57 శాతం కరువు భత్యం ఎండమావి అవుతుందా? కుటుంబ పెన్షన్ రూ.6000 మాత్రమే ఇస్తారా? అందుకనే యు.పి.ఎస్ వద్దు, ఎన్.పి.ఎస్ వద్దు. ఓ.పి.ఎస్ మాత్రమే కావాలి అంటున్నాం.

గ్రాట్యుటీ...

ఐదు సంవత్సరాల సర్వీస్ వున్న ప్రతి ఉద్యోగికి, ప్రతి ఏడాది సర్వీస్‌కు అర్ధ నెల మూల వేతనం, కరువు భత్యం కలిపి గ్రాట్యుటీ కింద ఇస్తారు. అత్యధికంగా 16.5 నెలల వేతనం ఇలా గ్రాట్యుటీ కింద ఇస్తారు. ఓ.పి.ఎస్ లో వున్న ఈ పథకం యు.పి.ఎస్ లో లేదు.

కమ్యుటేషన్

ఓ.పి.ఎస్ పథకంలో నెలసరి పెన్షన్‌లో 40 శాతం చొప్పున 12 సంవత్సరాలకు లెక్కించి మొత్తం పైకం పెన్షనర్‌కు పదవీ విరమణ చేసే సమయంలో ముందస్తుగా చెల్లిస్తారు. 15 సంవత్సరాల తరువాత ఆ 40 శాతం తిరిగి పెన్షన్లో కలిపి ఇస్తారు. ఈ 15 సంవత్సరాలకు కూడా మొత్తం పెన్షన్‌కు కరువు భత్యం వుంటుంది. అంటే ముందుగా తీసుకున్న 40 శాతానికి కూడా. ఈ సదుపాయం ఎన్.పి.ఎస్, యు.పి.ఎస్ పథకాల్లో లేదు.

అదనపు పెన్షన్

ఓ.పి.ఎస్ పథకంలో వయస్సును బట్టి అదనపు పెన్షన్ అందుతుంది. వయస్సు 80 దాటితే 20 శాతం అదనపు పెన్షన్ 85 దాటితే 30 శాతం, 90 దాటితే 40 శాతం, 95 దాటితే 50 శాతం, 100 దాటితే 100 శాతం అదనపు పెన్షన్ అమలులో వుంది. ఈ అదనపు పెన్షన్‌కు కరువు భత్యం వుంటుంది. ఎన్.పి.ఎస్, యు.పి.ఎస్ పథకాల్లో ఈ సదుపాయం లేదు.

పే కమిషన్

ఓ.పి.ఎస్ పథకంలో ప్రతి పే కమిషన్ సిఫార్సులు అమలు చేసే సమయంలో పెన్షన్, కనీస పెన్షన్ పెరుగుతుంది. యు.పి.ఎస్, ఎన్.పి.ఎస్ పథకంలో ఈ గ్యారెంటీ లేదు. ఎన్.పి.ఎస్, యు.పి.ఎస్ పథకాల్లో మన పెన్షన్ ఫండ్ పైకం షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడతారు. పెట్టుబడులు పతనమైనా కనీస గ్యారెంటీ పెన్షన్ వుంటుందన్న ఊరట మాత్రమే యు.పి.ఎస్ లో వుంది. అనేక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా సాధించిన సదుపాయాలను యు.పి.ఎస్ పథకం అమలైతే మనం కోల్పోవడం తథ్యం. ఓ.పి.ఎస్ మాత్రమే న్యాయమైనది. ఇది ఉద్యోగుల అవసరాలు తీర్చగలిగింది. కరువు భత్యంతో లింక్ చేయబడింది. కుటుంబ పెన్షన్ వుంటుంది. వారసులకు సైతం వర్తిస్తుంది. కనీస పెన్షన్ గ్యారెంటీ కూడా వుంది. కమ్యుటేషన్ సౌకర్యం వుంది. వయసుతో పాటు పెన్షన్ పెరుగుతుంది. ముదిమి వయసులో ఆర్థిక ఆలంబన కల్పిస్తుంది. ప్రస్తుతం 99 లక్షల మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై యు.పి.ఎస్ పడగ నీడ పడే ప్రమాదముంది.

షేర్ మార్కెట్ పెట్టుబడులు

ఈ 99 లక్షల మంది ఉద్యోగుల పెన్షన్ సొమ్ము రూ.10.50 లక్షల కోట్లు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులుగా మారనున్నాయి. ఈ పెట్టుబడులు కార్పొరేట్ పెట్టుబడిదారులకు వరం, అవసరం. వారి సంపద పెంపు కోసం ఉద్యోగుల పొదుపు పైకం తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పెన్షన్ గ్యారెంటీ అన్నది ఉద్యోగులను నమ్మించి నట్టేట ముంచే యత్నం. కార్మికుల పైకం మొత్తం తీసేసుకుని, పెన్షన్ ఇస్తారట. ఈ అమౌంట్ బ్యాంక్‌లో పెడితే వడ్డీ ఇస్తారుగా. ఈ నేపథ్యంలో ఓ.పి.ఎస్ పథకం పరిరక్షణ కోసం దేశ వ్యాప్త ఉద్యమం అవసరం. పంజాబ్, హర్యానా ఉద్యోగులు రంగంలోకి ఇప్పటికే వచ్చేశారు. కొన్ని రాష్ట్రాలు ఓ.పి.ఎస్ పథకం కొనసాగిస్తామని ప్రకటించాయి. తమిళనాడు, కేరళ లాంటి రాష్ట్రాల్లో త్వరలో ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయి. పోరాడితే సాధించలేనిది ఏదీ లేదు. యు.పి.ఎస్ వరకు వచ్చిన ప్రభుత్వాన్ని ఓ.పి.ఎస్ వరకు తీసుకు వెళ్లడం అసాధ్యమేమీ కాదు. సంఘటిత శక్తి ముందు తల వంచాల్సిందే.

ఆర్థిక లోటు

ప్రభుత్వం ఓ.పి.ఎస్ ను అమలు చేయలేని పరిస్థితిలో వుందని కొందరు కుహనా మేధావులు వాదిస్తున్నారు. ఆర్థిక లోటు 3 శాతం మించకూడదని నిర్ణయించినప్పుడు 5.9 శాతానికి పెంచింది ఎందుకు? ఎలా? కేంద్రం కార్పొరేట్ పన్నులు 30 శాతం నుండి 22 శాతానికి తగ్గించింది. కొత్త పెట్టుబడిదారులకు 15 శాతానికి తగ్గించింది. ఏడాదికి 1.50 లక్షల కోట్లు ఆదాయం కోల్పోయింది. కార్పొరేట్ బకాయిలు రూ.17 లక్షల కోట్లు మాఫీ చేసింది. కార్పొరేట్ పెట్టుబడి దారులకు ఇన్సెంటివ్ రూపేణా రూ.2 లక్షల కోట్లు ఇచ్చింది. డబ్బు లేదు అనేది సమస్య కాదు. ఇది వర్గ సమస్య. కార్మికుల సొమ్ములు దోచి పెట్టుబడి దారులను సంతృప్తి పరచడం. మన హక్కుల కొనసాగింపు కోసం ఉద్యమం నిర్మించాల్సిన అవస రం ఆసన్నమైంది. ఉద్యమిస్తే విజయం మనదే.

/వ్యాసకర్త దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు నాయకుడు /

కవిత్వం



ఈ పాపం ఎవరిది?

ఆకాశానికి చిల్లు పడినట్లు
భూమంతా సముద్రం అయ్యింది!!
సముద్రమంతా భూమయ్యింది
ఏది ఏదో తెలియని రోజయ్యింది!!

ప్రకృతి పగబట్టింది
తనని లెక్క చేయనప్పుడు
ఫలితం ఇలానే ఉంటుంది!!
చెరువులన్నీ ఆక్రమిస్తే
నీళ్లన్నీ ఊళ్లను ఆక్రమిస్తాయి!!

చెరువులను ఆక్రమించడం నీవంతయితే!!
ఊళ్ళని ఆక్రమించడం నీటి వంతయింది!!

తప్పంతా మనదే
అధికారానికో, డబ్బుకో
లొంగి అనుమతులిస్తే
ఆనక బాధపడేది
సామాన్య ప్రజలే!!

సామాన్య ప్రజల కష్టాలు
పట్టేది ఎవరికి?
రోజంతా తిండి లేక
నీటిలో, చీకటిలో
నీటితో వచ్చే పురుగు, పుట్రతో
ప్రత్యక్ష నరకం అనుభవించేది ఎవరు?
ఈ పాపం ఎవరిది?

(తెలుగు రాష్ట్రాల్లో జల విలయం సందర్భంగా)

**- ఏడుకొండలు కళ్ళేపల్లి,
మచిలీపట్నం, సెల్ : 9490832338**

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

బ్రిక్స్ బ్యాంక్‌లో చేరిన అల్జీరియా


ఎల్ డిజారి : బ్రిక్స్ నూతన అభివృద్ధి బ్యాంక్ (ఎన్‌డిబి)లో సభ్యురాలిగా అల్జీరియా తాజాగా చేరిందని ఆ దేశ ఆర్థిక శాఖ ప్రకటించింది. శనివారం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఎన్‌డిబి చీఫ్ దిల్మా రౌసెఫ్ కేప్‌టౌన్‌లో జరిగిన సమావేశంలో ప్రకటించారు.

బాధితులను ఆదుకున్నాకే వెళ్తా

సిఎం చంద్రబాబునాయుడు

32 డివిజన్లకు 32 మంది ఐఎఎస్ అధికారులు


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విజయవాడలోని వరద బాధితులను ఆదుకున్నాకే తాను ఇక్కడి నుండి వెళతానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. సోమవారం రాత్రి విజయవాడ కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణానదికి చరిత్రలో రానంత వరద వచ్చిందని తెలిపారు. సింగ్‌నగర్ ప్రాంతంలో బుడమేరు ముంపు ఏరియాలో ఎన్నిచేసినా ఇంకా చివరి ప్రాంతాలకు చేరుకోలేకపోయామని, మంచినీరు ఇస్తే అమృతంలా భావిస్తున్నారని, అన్ని ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారిని అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. దీనికోసం 32 డివిజన్లకు 32 మంది ఐఎఎస్ అధికారులను నియమించామన్నారు. బోట్లు, హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా అవసరమైన వారికి ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా బాధితులందరినీ ఆదుకున్నాకే ఇక్కడ నుండి వెళతామని చెప్పారు. కేంద్రం నుండి సుశిక్షితులైన ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది వస్తున్నారని, వారు వీలైనంత వేగంగా సేవలు అందిస్తారని పేర్కొన్నారు. 30 బృందాలు 120 బోట్లలో వెళతారని చెప్పారు. కృష్ణానది వరద తగ్గడంతో భవానీపురం వైపు వచ్చే నీరు తగ్గిందని వివరించారు. చరిత్రలో లేని విధంగా ప్రకాశం బ్యారేజీకి 11.43 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చిందని తెలిపారు. 2009లో 10.90 లక్షల క్యూసెక్కుల వచ్చిందని పేర్కొన్నారు. ఇంత పెద్దఎత్తున వరద కృష్ణానది చరిత్రలో రాలేదని వివరించారు. ప్రకాశం బ్యారేజీ గేట్లు 11.95 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేవిధంగా రూపొందిస్తే... 11.43 లక్షల క్యూసెక్కుల వరద రావడం చరిత్రలో ఎప్పుడూ లేదని అన్నారు. కృష్ణలంక పరిధిలో తాము గతంలో 18 అడుగుల రిటైనింగ్‌వాల్ కడితే, అనంతరం 14 అడుగులు మాత్రమే కట్టారని, దీనివల్ల గోడను దాటి నీరు లోపలకు వచ్చిందని పేర్కొన్నారు. భవానీపురంలో రోడ్డుదాటి నీరు ఇళ్లలోకి చేరిందన్నారు. ప్రస్తుతం నీరు తగ్గిన తరువాత ముంపు తగ్గుతోందని చెప్పారు. సింగ్‌నగర్ ప్రాంతంలో ఒకటిన్నర అడుగులు తగ్గిందని తెలిపారు.

పెరుగుతున్న పారిశ్రామిక ప్రమాదాలు

- యాజమాన్యాల నిర్లక్ష్యమే ప్రధాన కారణం
- అరికట్టే చర్యలు తీసుకోకపోవడం శోచనీయం
- జిఒ 62 దుర్మార్గం : సిహెచ్ నర్సింగరావు



ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలు పెరుగుతున్నాయని, ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని కార్మికులు పనిచేస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రమాదాలను ప్రభుత్వాలు అరికట్టాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలోని ఎసెన్షియా, సినర్జిన్ ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 21 మంది చనిపోయారని, పలువురు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరారని తెలిపారు. 2021 మే 7న విశాఖ ఎల్‌జి పాలిమర్స్‌లో జరిగిన ఘోరప్రమాదంలో దాదాపు 15 మంది కార్మికులు చనిపోయారని, వేలాది మంది నేటికీ అనారోగ్యాలతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రమాదాలను అరికట్టే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోకపోవడం శోచనీయమన్నారు.

మరణించిన కార్మిక కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని ఇవ్వొచ్చు గానీ కార్మికుల ప్రాణాలను తిరిగి తీసుకురాలే రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మృతుల కుటుంబాలకు ఇచ్చిన చెక్కులకు సంబంధించిన నష్టపరిహారం ఇంకా అందలేదని తెలిపారు. ఎస్ఇజెడ్, ఎల్‌జి కంపెనీల డిజైన్‌లో లోపాలున్నట్లు స్పష్టమవుతోందన్నారు. యంత్రాలు, పైపులు, రియాక్టర్లలో నాణ్యత కొరవడిందని వివరించారు. యాజ మాన్యాల నిర్లక్ష్యమే ప్రమాదా లకు కారణమని హైపవర్ కమిటీలు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కార్మికుల ప్రాణాలు తీస్తున్న యాజమాన్యాలను ప్రభుత్వాలు ఎందుకు అరెస్టు చేయడంలేదని ప్రశ్నించారు. తనిఖీలు ఎప్పుడు చేసినా కంపెనీల యజమాను లను వేధించరాదని ముఖ్యమంత్రి చెప్పడం సరైంది కాదని, యజమానులకు భయం లేకపోతే ఇటువంటి ప్రమాదాలను ఎలా అరికట్టగలమన్నారు. ముఖ్యమంత్రి జరిపిన రివ్యూలో థర్డ్ పార్టీతో ఆడిట్ జరపాలంటున్నారని, అటువంటిది బోగస్ ఆడిట్ అవుతుందని వివరించారు. ప్రభుత్వమే ఆడిట్ జరిపించాలని, తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2019లో తనిఖీలు నిలిపేస్తూ చంద్రబాబు విడుదల చేసిన జిఒ 62 దుర్మార్గమైనదన్నారు. ఆ జిఒ రద్దుపై మాట్లాడకుండా, తనిఖీలు చేపట్టకుండా కార్పొరేట్ల పక్షాన తామున్నామని చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారని విమర్శించారు. ఇటీవల ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో ప్రమాదం జరిగిందని, ఇటువంటివి నిత్యకృత్యమయ్యాయని తెలిపారు.

తీస్తా నదీ జలాలపై భారత్‌తో చర్చిస్తాం

- బంగ్లాదేశ్ జలవనరుల సలహాదారు హసన్ వెల్లడి

ఢాకా : తీస్తా నదీ జలాల పంపిణీ ఒప్పందంపై భారత్‌తో చర్చలను పున:ప్రారంభించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భావిస్తోందని జల వనరుల శాఖ సలహాదారు సయ్యదా రిజ్వానా హసన్ తెలిపారు. నీటిపంపిణీపై అంతర్జాతీయ సూత్రాలు, నిబంధనలకు ఎగువ, దిగువ పరీవాహక దేశాలు కట్టుబడి వుండాలని అన్నారు. ఆదివారం ఢాకాలో పిటిఐకి ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారు. చర్చల ద్వారా భారత్‌తో తీస్తా ఒప్పందం, ఇతర నీటి పంపిణీ ఒప్పందాలు సామరస్యంగా పరిష్కారమవగలవన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఒప్పందం కుదరని పక్షంలో బంగ్లాదేశ్ అంతర్జాతీయ చట్టపరమైన పత్రాలను, సూత్రాలను పరిగణనలోకి తీసుకోవచ్చని సూచించారు. రెండేళ్లలో గంగా నది ఒప్పందం కూడా ముగియను అందువల్ల దానిపై కూడా కసరత్తు చేయాల్సి వుందన్నారు. తీస్తాపై ఉభయ పక్షాలు అంగీకారానికి వచ్చి, ముసాయిదా కూడా సిద్ధమైందని, కానీ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి వ్యతిరేకత వల్ల ఒప్పందంపై సంతకాలు జరగలేదన్నారు. అందువల్ల ఈసారి ముసాయిదాపై చర్చలతో ప్రారంభించాలని ఆమె భారత్‌ను కోరారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను భారత్‌నుండి రప్పించే విషయమై తాత్కాలిక ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి వుందని హసన్ తెలిపారు. హసీనా ప్రభుత్వం ప్రజలకు చేసిన అన్యాయానికిగానూ బంగ్లాదేశ్ ప్రజలకు న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. దేశాన్నివీడి వెళ్లిన ఆమె కచ్చితంగా ప్రధాన నిందితురాలని ఆమె వ్యాఖ్యానించారు.

రెస్కో మాజీ అధ్యక్షుడు సెంథిల్ కుమార్ అరెస్టు

ప్రజాశక్తి - కుప్పం టౌన్

రూరల్ ఎలక్ట్రిక్ కో - ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (రెస్కో) మాజీ అధ్యక్షులు సెంథిల్ కుమార్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రెస్కో అధ్యక్షులుగా కొనసాగిన ఆయన అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడ్డారని, రెస్కో సంస్థలో వందల కోట్ల రూపాయలు అక్రమంగా దోచేశారని, అడ్డదారిలో ఉద్యోగులను నియమించి, వారి నుంచి లక్షల రూపాయలు వసూలుకు పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. కుప్పం పోలీసులు సీర్.నెం. 271/2024, 420, 406, 468, 409 ఐపిసి ఆర్ / డబ్లుయూ 34 సెక్షన్ల కింద కేసు పెట్టారు. టిడిపి అధికారం చేపట్టిన తర్వాత సహకార శాఖ ప్రత్యేక అధికారులు రెస్కో సంస్థలో విచారణ నిర్వహించారు. ఈ క్రమంలో రెస్కో మాజీ అధ్యక్షులను ఏ వన్‌గా చూపుతూ కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆయనను తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో అరెస్టు చేసినట్టు పట్టణ సిఐ జిటి నాయుడు తెలిపారు.

నేటి నుంచి ఐసెట్ తుదిదశ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐసెట్ తుదిదశ కౌన్సిలింగ్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్, ఐసెట్ కన్వీనర్ పి ఉమామహేశ్వరి సోమవారం విడుదల చేశారు. వెబ్ కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్ ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు జరుగుతుంది. అభ్యర్థుల సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఉంటుంది. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ 9 నుంచి 14వ తేదీ వరకు, ఆప్షన్ల మార్పు చేసుకునేందుకు 15వ తేదిన అవకాశం ఇస్తారు. సీట్ల కేటాయింపు 17వ తేది ఉంటుందని, అభ్యర్థులు 21వ తేది వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలని కార్యదర్శి వెల్లడించారు. సీట్ల ఖాళీల వివరాలను 23వ తేదిన ఉన్నత విద్యామండలికి అందిస్తామని పేర్కొన్నారు.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
OA: 580 OF 2024

Between:
M/s Axis Bank Limited, Rep, by its Authorized Officer Mr. Chokkakula Varun Rajnavardha, Office at No - 43-9-141, 4th Floor, Sri Gayatri Towers, Srikanya Main Road, Dondaparthy, Vishakaptnam - 530016 *** APPLICANT BANK
And
To,
1. **M/s. Sri Manikanta See Foods,** Rep By its Proprietor, Peetha Srinivasa Rao, D.No. 6-10-122, 19th Ward, Repalle, Guntur District, Andhra Pradesh - 522265.
2. **Mr. Peetha Srinivasa Rao,** S/o. Peetha Swameru. D.No. 5-30-128/1, Masjid Road, Revenue Ward No.5, Repalle, Guntur District, Andhra Pradesh - 522265.
3. **Smt. Peetha Kanka Durga,** W/o. Peetha Srinivasa Rao, D.No. 5-30-128/1, Masjid Road, Revenue Ward No.5, Repalle, Guntur District, Andhra Pradesh - 522265. ***DEFENDANTS

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANTS NO. D.1 to D.3 BY WAY OF PAPER PUBLICATION

D.1: M/s. Sri Manikanta See Foods, Rep By its Proprietor, Peetha Srinivasa Rao, D.No. 6-10-122, 19th Ward, Repalle, Guntur District, Andhra Pradesh - 522265.
D.2: Mr. Peetha Srinivasa Rao, S/o. Peetha Swameru. D.No. 5-30-128/1, Masjid Road, Revenue Ward No.5, Repalle, Guntur District, Andhra Pradesh - 522265.
D.3: Smt. Peetha Kanka Durga, W/o. Peetha Srinivasa Rao, D.No. 5-30-128/1, Masjid Road, Revenue Ward No.5, Repalle, Guntur District, Andhra Pradesh - 522265.

1. WHEREAS the Applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act 1993 against you for the recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at **10.30 AM** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **17/09/2024.** you are directed to collect the Copy or the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader /Advocate duly instructed.
4. Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the **27th Day of August, 2024**

Sd/- Signature of the Officer Authorised to issue summons

Bank of India Relationship beyond banking

అరండల్‌పేట బ్రాంచి, డి.నెం. 4-12-40, పి.ఎస్. కాంప్లెక్స్, కొరిటెపాడు మెయిన్ రోడ్డు, గుంటూరు-522007. ఫోన్: 0863-2271005

సంక్షిప్త డిమాండ్ నోటీసు

Bank of India Relationship beyond banking

అరండల్ పేట బ్రాంచి, డి.నెం. 4-12-40, పి.ఎస్. కాంప్లెక్స్, కొరిటెపాడు మెయిన్ రోడ్డు, గుంటూరు-522007. ఫోన్: 0863-2271005

సంక్షిప్త డిమాండ్ నోటీసు

TATA

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డు చిరునామా : 11వ అంతస్తు, టవర్ ఏ, పెనిన్సులా బిజినెస్ పార్క్, గణపత్‌రావు కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి - 400 013.
బ్రాంచ్ చిరునామా : టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.54-15/4సి/1, 5వ అంతస్తు, అర్‌కె గల్లెరియా, శ్రీనివాస్ బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోనిరూల్ 9(1)తో చదవగల రూల్ 8(6) క్రింద)

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) మరియు రూల్ 9(1) యొక్క నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత / సహ-రుణగ్రహీత, లేదా వారి చట్టబద్ధ వారసులు / ప్రతినిధులు (రుణగ్రహీత)లకు ప్రకటన ఇవ్వడమేమనగా, **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్)కు తాకట్టుపెట్టబడిన దిగువ వివరించిన స్థిరాస్తిని టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడినది, అవి దిగువ పేర్కొనబడిన రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతల నుండి బాకీపడిన బకాయిల రికవరీ కొరకు **"ఎక్కడ ఉన్నది & అది అక్కడ అలాగే" మరియు "ఉన్నది ఉన్నట్టుగా మరియు ఏదేని రికోర్స్ లేకుండా ప్రాతిపదికన" 19-09-2024న విక్రయించబడుతుంది.** రిజర్వు ధర మరియు ధరావత్తు దిగువ పేర్కొనబడినవి. ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, అమ్మకంలో ఏవేని వాయిదాలు/నిలిపివేయుటలో ఏవేని గైర్హాజరులో, సదరు సెక్యూర్డ్ అసెట్/ఆస్తిని **ఇ-వేలం** ద్వారా సదరు **19-09-2024న మ. 2.00గం.లకు** విక్రయించబడుతుంది. ఇ-వేలంలో పాల్గొనుట కొరకు ధరావత్తు డిమాండ్ డ్రాఫ్ట్ కలిగియున్న సీల్డు ఎన్వలప్‌ను **బ్రాంచ్ చిరునామా : టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్,** డోర్ నెం.54- 15/4సి/1, 5వ అంతస్తు, అర్‌కె గల్లెరియా, శ్రీనివాస్ బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008 వద్ద **18-09-2024న సా. 5.00 గం.ల వరకు లేదా ముందుగా** టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ యొక్క అధీకృత అధికారికి దాఖలు చేయబడాలి.

14) పై పేర్కొన్న వివరాలకు దయచేసి సెక్యూర్డ్ క్రెడిటర్ వెబ్‌సైట్: https://tinyurl.com/2ukwhd3v లో ఇవ్వబడిన దిగువ లింకును పరిశీలించవచ్చును.
15) దయచేసిలింక్‌ను కూడాను దర్శించండి: https://www.tatacapital.com/property-disposal.html

దయచేసి గమనించండి : ఈ ఆస్తి యొక్క అమ్మకం / వేలం కొరకు పేర్కొన్న వేలం పార్ట్‌నర్ కాకుండా ఎవరైనా బ్రోకర్ / ఏజెంట్‌ను టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ నియమించలేదు. ఈ విషయంలో అన్ని ప్రశ్నలు & విచారణ కొరకు క్రింది సంతకందారు లేదా అధీకృత అధికారిని మాత్రమే ఆసక్తిగల పార్టీలు సంప్రదించాలి.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేది : 03-09-2024

సం/- అధీకృత అధికారి,
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ రీటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీస్/బ్రాంచ్) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డో.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002

రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్ గా పేర్కొనబడినది) "త్రిశూల్", సమర్తేశ్వర్ గుడి ఎదురు, లా వద్ద గార్డెన్, ఎలిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద దీని నమోదిత కార్యాలయం ఉంది. ఇతర ప్రదేశాలలో ఉన్న దీని శాఖా కార్యాలయం డో.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002 యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు :

క్ర. సం.	దరఖాస్తుదారు/ సహ-దరఖాస్తుదారు, హామీదారుల పేరు/ చిరునామా	బాకీ రూ.లలో	తనఖాకు సమానంగా ఆఫర్ చేయబడిన ఆస్తులు మరియు స్వాధీనత తేది
1	1. **శ్రీ. బాసుదేవ్ యాద,** తండ్రి. డిలో యాదవ్, డో.నం.2-179/4, కోలావారి వీధి, రామవరప్పాడు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-521108. **ఇక్కడ కూడా : శ్రీ బాసుదేవ్ యాద (ప్రొప్రైటర్) కేరాఫ్. సంగీత ఇంజనీరింగ్,** డో.నం.48-11/8-7ఎ, విజయగార్డెన్ ప్రక్కన, కరెన్సీ నగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520008. 2. **శ్రీమతి. శిల్పి యాదవ్,** భర్త. బాసుదేవ్ యాదవ్, డో.నం.2-179/4, కోలావారి వీధి, రామవరప్పాడు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-521108. డిమాండ్ నోటీసు తేది: 15-05-2024 ఎల్ఎఎన్ ఎకౌంట్ నెం. PHR006900491685	రూ. 9,94,969/- (తొమ్మిది లక్షల తొంభై నాలుగు వేల తొమ్మిది వందల అరవై తొమ్మిది రూపాయలు మాత్రమే)	**షెడ్యూల్-ఎ :** కృష్ణాజిల్లా, విజయవాడ రూరల్ మండలం, విజయవాడ తూర్పు రిజిస్ట్రారర్ కార్యాలయం, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధిలోనిరామవరప్పాడు గ్రామంలో ఉన్న ఆస్తి ప్లాట్ నం.12, బేరింగ్ ఆర్.ఎస్.నం.130, మరియు **క్రింది విధమైన సరిహద్దులు : తూర్పు :** ప్లాట్ నం.16, **దక్షిణం :** 30 అ.లు. వెడల్పు పంచాయతీ రోడ్డు, **పడమర :** కె.లక్ష్మీ రాజ్యం మొదలైనవారి ఆస్తి, **ఉత్తరం :** బి.రామారావు మొదలైనవారి ఆస్తి. పై నాలుగు సరిహద్దుల మధ్య సైట్ పరిధి 387.5 చ.గ.లు. లేదా 316.47 చ.మీ.లు. ఆ అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 47 చ.గ.లు. లేదా 39.29 చ.మీ.లు. ఉమ్మడి సైట్. **షెడ్యూల్-బి :** పై షెడ్యూల్-ఎ సైట్‌లో, "శ్రీ సాయి లక్ష్మి నిలయం" పేరు మరియు శైలి క్రింద నిర్మించబడిన గ్రూప్ ఇంటి గ్రౌండ్, ఒకటవ మరియు రెండవ అంతస్తు భవనంలోని ఒకటవ అంతస్తులో ఫ్లాట్ నం.ఎఫ్.ఎఫ్-3 మరియు **హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** మెట్లకేస్ మరియు ఫ్లాట్ నం.ఎఫ్.ఎఫ్-2 పై నాలుగు సరిహద్దుల పరిధి, ఒకటవ అంతస్తులోని ఫ్లాట్ నం.ఎఫ్.ఎఫ్.-3 ప్లింత్ ఏరియా 931 చ.అ.లు., కామన్ ఏరియా 69.0 చ.అ.లు., కార్ పార్కింగ్ ఏరియా 84.0 చ.అ.లు. మరియు "శ్రీ సాయి లక్ష్మి నిలయం" కు చెందిన మొత్తం ఉమ్మడి హక్కులు మరియు కామన్ ఏరియాలు మరియు కామన్ సౌకర్యాలు మరియు అన్నీ సౌలభ్య ఉమ్మడి హక్కులు. లాంఛనప్రాయ స్వాధీనత : **30.08.2024**

తేది: 30.08.2024
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

RBL BANK

ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్

రిజిస్టర్డు ఆఫీసు : 1వ లేన్, షాహుపురి, కొల్హాపూర్-416 001.
బ్రాంచి ఆఫీసు : 3వ అంతస్తు, ప్రెస్టీజ్ టవర్, 99 & 100, రెసిడెన్సీ రోడ్, బెంగళూరు-560 025

ఇ-వేలం అమ్మకపు ప్రకటన (సార్ఫసీ యాక్ట్, 2002 క్రింద)

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్") యొక్క రూల్ 8(6)తో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 ("సార్ఫసీ") క్రింద బ్యాంకుకు చార్జ్‌చేయబడిన స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత, హామీదారులు & తాకట్టుదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు **ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్ ("సెక్యూర్డ్ క్రెడిటర్ / బ్యాంక్")**కు (సేకరణలో **"ఆస్తి"** గా పేర్కొనబడుతుంది) తాకట్టు/చార్జ్‌చేయబడినది, ఇందు దిగువ వివరించినట్లుగా రూల్స్‌తో చదువబడే సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద బ్యాంకు యొక్క అధీకృత అధికారిచేత **స్వాధీనపరుకోవడలం జరిగింది,** రూల్స్ యొక్క రూల్సు 8&9 క్రింద ఇందు దిగువ వివరించినట్లు బ్యాంకుకు బకాయిలు ప్లస్ వడ్డీని రికవరీచేయుట కొరకు దిగువ ఇ-వేలం షెడ్యూలు ప్రకారం బిడ్స్ ఆహ్వానించి, **02.05.2024న "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" మరియు "రీకోర్స్ లేకుండా"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది.

పార్టీలు, బకాయి మొత్తం మరియు ఆస్తి యొక్క సంక్షిప్త వివరణ

కరకట్టను తాకుతున్న వరద

- పలుచోట్ల లీకేజీలు, స్వల్పంగా గండ్లు
- ఇసుక బస్తాలతో పటిష్టం
- అమరావతి నుంచి రేపల్లెవరకు ముంపు
- భయం గుప్పిట్లో కృష్ణా తీరవాసులు
- సిఎం నివాసంతోపాటు తుళ్లూరు, తాడేపల్లి మండలాల్లో పలు భవనాల మునక


తుళ్లూరు మండలం బోరుపాలెం వద్ద కరకట్టకు పడ్డ గండికి ఇసుక మూటలు అడ్డుగా పెట్టిన వైనం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రకాశం బ్యారేజీకి 11 లక్షల క్యూసెక్కుల ప్రవాహం రావడంతో కరకట్టను వరద ముంచెత్తుతోంది. దీంతో, అమరావతి నుంచి రేపల్లె వరకు కృష్ణా నది పరివాహక గ్రామాల ప్రజలు గుప్పిట్లో ఉన్నారు. ప్రకాశం బ్యారేజీ దిగువన కొల్లూరు, కొల్లిపర, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో కరకట్టపైకి వరద నీరు వస్తుండడంతో అధికారులు ఎక్కడికక్కడ ఇసుక బస్తాలతో ఉధృతిని బయటకు రాకుండా నిరోధించారు. పలుచోట్ల స్వల్పంగా గండ్లు పడిన ప్రాంతాల్లో ఇసుక బస్తాలతో తాత్కాలికంగా పూడ్చి వేశారు. ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంతో పాటు ఈ ప్రాంతంలో కృష్ణా కరకట్ట పక్కన ఉన్న భవనాలన్నీ నీట మునిగాయి. వెంకటపాలెం వద్ద ఉన్న మంతెన సత్యనారాయణ ప్రకృతి వైద్య చికిత్స ఆశ్రమం నుంచి రోగులను అంబు లెన్సులో విజయవాడకు తరలించారు. కరకట్ట పక్కనే ఉన్న భవనాలను పరిశీలించి వారిని ఖాళీ చేయించా రు. తుళ్లూరు మండలం వెంకటపాలెం వద్ద కృష్ణా నదికి ఆదివారం రాత్రి గండిపడింది. పక్కనే సిఎం నివాసం ఉండడంతో స్థానికులు ఇసుక మూటలు, రాళ్లు అడ్డుగా పెట్టారు. ఇసుక బస్తాలతో తాత్కాలి కంగా కట్టను పటిష్టపరిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం మరోసారి గండిపడడం తో స్థానికులు దానిని పూడ్చి వేశారు. తుళ్లూరు, తాడేపల్లి మండలంలోని కరకట్ట పరిస్థితిని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు... సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి కరకట్టను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. సిఎం నివాసం ఇక్కడే ఉండడంతో అధికారులు హుటాహుటిన చర్యలు చేపట్టారు. వెంకటపాలెంతో పాటు కరకట్ట వెంబడి బోరుపాలెం దగ్గర రెండు చోట్ల, హరిశ్చంద్రపురం దగ్గర కరకట్టకు గండ్లు పడడంతో ఇసుక బస్తాలను రక్షణగా ఏర్పాటు చేశారు. కొల్లూరు మండలం అరవింద వారధి వద్ద గతంలో వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోవడంతో తొమ్మిది గ్రామాలకు ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నక్కపాయ వద్ద గండి పడడంతో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌టిఆర్‌ఎఫ్ బృందాలను, గజ ఈతగాళ్లను అధికారులు సిద్ధం చేశారు. కొల్లూరు మండలం పెదలంక, చింతలంక, ఈపూరు లంక, సుగ్గుణ లంక, చిలుమూరు లంక, అన్నవరపు లంక, కనిగిరిలంక, కొత్తూరు లంక, గాజు ల్లంక, పోతార్లంకలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొల్లిపర మండలంలోని కరకట్టల వెంబడి ఉన్న వల్లభా పురం, అత్తలూరువారిపాలెం, హనుమాన్ పాలెం వద్ద గండ్లు పడ్డాయి. మంత్రులు నాదెండ్ల మనోహర్, గొట్టిపాటి రవి ఆయా గ్రామాలను సందర్శించారు. నీట మునిగిన ప్రాంతాలను కరకట్ట వద్ద వరద ఉధతిని అధికారులతో కలిసి పరిశీలించారు. కొల్లిపర మండలం హనుమాన్‌పాలెం కరకట్టకు బలహీనంగా ఉన్న చోట ఇసుక బస్తాలు వేయించే సహాయక చర్యల్లో గ్రామస్తులతో కలిసి పాల్గొన్నారు. భట్టిప్రోలు మండ లం పెదపులివర్రు, పెసర్లంక, వెల్లటూరు, కొల్లూరు మండలం దోనేపూడి వద్ద గండ్లు పడే అవకాశం ఉండ డంతో కరకట్ట వెంబడి గస్తీ పెంచారు. నీరు లీకేజీలను గుర్తించిన అధికారులు వెంటనే ఇసుక బస్తాలతో ప్రాథమిక స్థాయిలోనే గండ్లు పడకుండా నిరోధిం చారు. రేపల్లె మండలం రావి అనంతరం నీరు లీకేజీ కావడంతో కరకట్ట పటిష్టతకు చర్యలు చేపట్టారు. బౌద్ధారామం అమరావతి మొత్తం నీట మునిగింది. అమరలింగేశ్వరస్వామి దేవాలయం జలదిగ్బంధంలో చిక్కు కుంది. దాచేపల్లి, అచ్చంపేట, మాచవరం, క్రో సూరు, తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల, కొల్లూ రు, భట్టిప్రోలు, రేపల్లే మండలాల్లోని కృష్ణా కర కట్టకు సమీపంలో నివసిస్తున్న వారంతా తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ఆయా గ్రామాల్లో వరద నీరు ఉధృతితో లంక వాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు.

రెండు లక్షల ఎకరాల్లో పైర్లు మునక

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీ వర్షం, వరదలకు రెండు లక్షల ఎకరాల్లో పైర్లు నీట మునిగాయి. వరి, పత్తి, మిర్చి, పసుపు, కంది, కూర గాయాలు తదితర పంటలు నీటిలో తేలియాడుతున్నాయి. త్వరగా నీరు బయటకుపోతే పైర్లు నిల దొక్కుకుంటాయని, ఎక్కువ రోజులు నీరు నిలబడితే భారీ నష్టం ఉంటుందని అధికారులు అంచనా వేస్తు న్నారు. వెద పద్ధతిలో సాగు చేసిన వరి కొన్ని ప్రాంతాల్లో ఎందుకూ పనికిరాకుండా పోయింది.

ఘనంగా వైఎస్‌ఆర్ వర్ధంతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. వైసిపి గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నాయకులు కొమ్మూరి కనకరావు, సునీత తదితరులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగార్జున, శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో అయినా, సంక్షేమ పథకాలు అమలులోనైనా రాజశేఖర్‌రెడ్డి పాత్ర మరువలేనిదని అన్నారు.

వలస కార్మికుల బాగుకు ఏం చేశారు?

- వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయండి
- కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం



న్యూఢిల్లీ : వలస కార్మికులకు సంక్షేమ చర్యలపై తీసుకున్న చర్యలతో అఫిడవిట్‌ను దాఖలు చేయాలని సుప్రీం కోర్టు సోమవారం కేంద్రాన్ని ఆదేశించింది. 2021లో తాము ఇచ్చిన తీర్పు, తదనంతరం జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వడం, చేపట్టిన ఇతర సంక్షేమ చర్యల వివరాలను అందచేయాలని ఆదేశించింది. కోవిడ్ సమయంలో తీవ్ర ఇబ్బందుల పాలైన వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వడంతో సహా పలు సంక్షేమ చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశిస్తూ సుప్రీంకోర్టు 2021 జూన్ 29న తీర్పు ఇచ్చింది. తదనంతర కాలంలో కూడా పలు ఆదేశాలు జారీ చేసింది. ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన వలస కార్మికులందరికీ ఇవి వర్తింపజేయాలని కోరింది. జస్టిస్ సి.టి.రవికుమార్, జస్టిస్ సంజయ్ కరోల్‌లతో కూడిన బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

ఇ-శ్రమ్ అనేది దేశవ్యాప్తంగా గల అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రమైన జాతీయ డేటాబేస్ (ఎన్‌డియుడబ్ల్యు). అసంఘటిత కార్మిక లోకానికి సంక్షేమ ప్రయోజనాలు అందజేయడంతో పాటూ సామాజిక భద్రతా చర్యలను చేపట్టే లక్ష్యంతో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈ డేటాబేస్‌ను ప్రారంభించింది.

కోవిడ్ సమయంలో సుప్రీం కోర్టు సుమోటోగా ఈ కేసును చేపట్టింది. ఇప్పుడు కరోనా కాలం ముగిసినందున ఇక ఆ కేసును మూసివేయవచ్చని న్యాయవాదికి సూచించిన నేపథ్యంలో లాయర్ ప్రశాంత్ భూషణ్, జస్టిస్ కరోల్ మధ్య తీవ్ర మాటల యుద్ధం చోటు చేసుకుంది.

"కోవిడ్ ముగిసింది. ఒకవేళ రేషన్ కార్డుల జారీలో ఎవరికైనా ఇబ్బంది వుంటే వారు సంబంధిత హైకోర్టులకు వెళ్లవచ్చు. ఈ ఆదేశాలతో మేం ఈ కేసును మూసివేయాలనుకుంటున్నాం" అని జస్టిస్ కరోల్ పేర్కొన్నారు. దానిపై ప్రశాంత్ భూషణ్ చాలా తీవ్రంగా స్పందించారు. ఈ కార్యకలాపాల పరిధి చాలా విస్తరించి వుంది. ఈ సమయంలో కేసును మూసివేస్తే అది న్యాయ క్రమశిక్షణను ఉల్లంఘించినట్లవుతుంది, మీరు అలా చేయరాదని' చెప్పారు.

ఇరు పక్షాల మధ్య వాడిగా వేడిగా వాదనలు కొనసాగిన అనంతరం ఈ కేసులో గతంలో కోర్టు జారీ చేసిన ఆదేశాలను అమలు చేయరాదని కేంద్రం యోచిస్తోందని భూషణ్ పేర్కొన్నారు. 2021లో జనగణన జరిగింది. దానికి అనుగుణంగా జనాభా సర్వే చేపట్టింది. కోటి మంది ప్రజలు రేషన్ కార్డులకు అర్హులని తేలింది. కానీ తాము ఇక రేషన్ కార్డులు జారీ చేసేది లేదని ప్రభుత్వం చెబుతోందని భూషణ్ పేర్కొన్నారు. ఈ దశలో అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భటి మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హులైన వారందరికీ ప్రస్తుతం కేంద్రం రేషన్ ఇస్తోందని చెప్పారు. ఆ వెంటనే అన్ని వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని బెంచ్ కేంద్రాన్ని ఆదేశించింది.

సమస్యల పరిష్కారానికి కమిటీ

- అన్నదాతల ఆందోళనపై సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ : శంభు సరిహద్దులో ఆందోళన చేస్తున్న అన్నదాతల సమస్యలను పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు సోమవారం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. పంజాబ్-హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవాబ్ సింగ్ దీనికి నాయకత్వం వహిస్తారు. వారం రోజుల్లో తొలి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ కమిటీని ఆదేశించింది. రైతుల సమస్యలను రాజకీయం చేయరాదని, వాటిని కమిటీ దశల వారీగా పరిశీలిస్తుందని బెంచ్ తెలిపింది. శాంతియుతంగా జరుపుతున్న ఆందోళనను ప్రత్యామ్నాయ ప్రదేశాలకు మార్చే స్వేచ్ఛ రైతులకు ఉన్నదని న్యాయస్థానం స్పష్టం చేసింది.

అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఆ సరిహద్దు వద్ద రైతులు ఫిబ్రవరి 13వ తేదీ నుండి ఆందోళన జరుపుతున్నారు. రైతులు తమ డిమాండ్ల సాధన కోసం రాజధాని ఢిల్లీకి ప్రదర్శనగా వెళతారని సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా ప్రకటించిన నేపథ్యంలో హర్యానా ప్రభుత్వం అంబాలా-న్యూఢిల్లీ జాతీయ రహదారిపై ఫిబ్రవరిలో బారికేడ్లను ఏర్పాటు చేసింది. తమ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

గవర్నరు పదవిని రద్దు చేయాలి

- కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గవర్నరు పదవిని రద్దు చేయాలని, చిల్లర రాజకీయాలకు పాల్పడని వ్యక్తిని ఏకాభిప్రాయంతో నియమించాలని కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వి అన్నారు. గవర్నర్లు, ప్రతిపక్షాల పాలిత రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలు తలెత్తుతున్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు సోమవారం కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రికి సవాల్‌గా లేదా బెదిరింపుగా మారితే గవర్నరును తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు జరిగేది సిఎంను ఎన్నుకునేందుకు గానీ, గవర్నరును ఎన్నుకునేందుకు కాదని అన్నారు. కాగా, గవర్నర్లు బిల్లులను ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచడంపై అభిషేక్ సింఘ్వి ఆగ్రహించారు. గవర్నర్లు బిల్లులను ఆమోదించకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీనివల్ల పరిపాలన బాధాకరంగా మారుతోందని, ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాయని తెలిపారు. మరోవైపు గవర్నరు మరో చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లా, ఒకే ఒరలో రెండో కత్తిలా వ్యవహరిస్తున్నారని అభిషేక్ సింఘ్వి విమర్శించారు. గవర్నర్లు, సిఎంల కోసం అంబేద్కర్ రూపొందించిన సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం సిగ్గులేకుండా ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కర్ణాటక వంటి ప్రతిపక్షాల పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు, గవర్నర్ల మధ్య పదేపదే ప్రతిష్టంభనలు నెలకొంటున్న నేపథ్యంలో సింఘ్వి ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు.

స్వాతి మాలివాల్‌పై దాడి కేసులో... కేజ్రీవాల్ కార్యదర్శికి బెయిల్

న్యూఢిల్లీ : స్వాతి మాలివాల్‌పై దాడి కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రైవేటు కార్యదర్శి వైభవ్ కుమార్‌కు సుప్రీంకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కుమార్ ఇప్పటికే వంద రోజులకు పైగా జైలులో గడిపారని, విచారణ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పడుతుందని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. సాక్ష్యాలను తారుమారు చేయకూడదని, సాక్షులను ప్రభావితం చేయకూడదని నిందితుడిని ఆదేశించింది. ఢిల్లీ ముఖ్యమంత్రికి ప్రైవేటు కార్యదర్శిగా వ్యవహరించకూడదని కూడా నిర్దేశించింది. సాక్షులందరినీ విచారించే వరకూ వైభవ్ కుమార్ ముఖ్యమంత్రి నివాసంలో అడుగు పెట్టకూడదని షరతు విధించింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ ముందుగా ముఖ్యమైన సాక్షులను, బలహీనులైన ప్రైవేటు సాక్షులను విచారించాలని న్యాయస్థానం ఆదేశించింది.



ప్రతికూల వాతావరణమే కారణం

- రైసీ హెలికాప్టర్ ప్రమాదంపై తుది నివేదిక

టెహ్రాన్ : ఇరాన్ అధ్యక్షులు ఇబ్రహీం రైసీని బలిగొన్న హెలికాప్టర్ ప్రమాదానికి ప్రతికూల వాతావరణమే కారణమని వెల్లడయింది. ఈ విషయాన్ని తుది దర్యాప్తు నివేదిక ప్రకటించింది. మేలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో రైసీ, మరో ఏడుగురు మరణించిన సంగతి తెలిసిందే. దట్టమైన పొగమంచుతో కప్పబడిన పర్వతాన్ని గుర్తించకుండా హెలికాప్టర్ ఆకస్మికంగా ఢీకొందని నివేదిక తెలిపింది. ఇప్పటికే ఇరాన్ సైన్యం ఇచ్చిన నివేదికలోనూ హెలికాప్టర్ ప్రమాదానికి ప్రతికూల వాతావరణమే కారణమని పేర్కొంది.

విచారించే కోర్టు మారినా.. విషయం మారదు

- 'ఓటుకు నోటు' కేసులో సుప్రీం వ్యాఖ్యలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విచారించే కోర్టు మారినా... పరిధి మారదు, విషయం మారదని 'ఓటుకు నోటు' కేసులో అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసు విచారణను మరో రెండు వారాలు వాయిదా వేసినట్లు వెల్లడించింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బిఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, మహ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపున ఆర్యమా సుందరం వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ కాంగ్రెస్ అధికారిక సోషల్ మీడియాతో చేసిన ట్వీట్లను ఇంటర్ లోకేటరీ అప్లికేషన్ (ఐఎ) ద్వారా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో న్యాయవాదులు, న్యాయమూర్తులను అవమానించేలా సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసిందని, ఆ వివరాలు అన్ని ఐఎలో పొందుపరిచినట్లు న్యాయవాదులు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ బిఆర్ గవాయి 'ఎందుకు రాజకీయ నాయకులు కోర్టులు, న్యాయమూర్తులను వారి మధ్యలోకి లాగుతున్నారు' అని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి పరిధిలోనే హోంమంత్రి శాఖ ఉందని సుందరం మరోసారి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎసిబి, ఎసిబి ప్రాసిక్యూషన్, అలాగే అధికారులు ఆయనకే రిపోర్టు చేయాల్సి ఉంటుందన్న విషయాన్ని తాము దాఖలు చేసిన రిజాయిండర్‌లో సవివరంగా పొందుపరిచామన్నారు. ఎసిబి ఎవరిని విచారణ చేయాలి, వద్దు అనేది హోంమంత్రి శాఖనే నిర్ణయిస్తుందని వాదనలు వినిపించారు. ఈ వాదనలపై మరోసారి జోక్యం చేసుకున్న ధర్మాసనం 'ఒకవేళ మరోచోటుకు కేసు విచారణ మార్చితే కూడా... అధికారులు ఆయనకు చెప్పిన తర్వాతే కోర్టుకు వెళతారు కదా?' అని ప్రశ్నించింది. అప్పుడు పరిధి మారుతుందని, ప్రాసిక్యూషన్ హోంమంత్రి చేతుల్లో ఉండదని సుందరం వాదించారు. మధ్యలో తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహిత్గి జోక్యం చేసుకుని, ఇప్పటికే 25 మంది సాక్షుల నుంచి అన్ని వివరాలను ఎసిబి సేకరించిందని కోర్టుకు నివేదించారు. కాగా, మరోసారి పిటిషనర్ తరపు న్యాయవాదులు దాఖలు చేసిన ఐఎపై స్పందిస్తూ ప్రభుత్వ తరపు న్యాయవాదులను కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు, న్యాయవాదులను పబ్లిక్‌కు ట్యాగ్ చేశారని, దీనిపై తొలుత కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.



ప్రమాదంలో లౌకికవాదం

- వైఎస్ఆర్ సార్మక ఉపన్యాసంలో సిద్ధార్థ్ వరదరాజన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో లౌకికవాదం ప్రమాదంలో ఉందని, పదేళ్లుగా లౌకికవాదంపై దాడి జరుగుతోందని ప్రముఖ పాత్రికేయులు సిద్ధార్థ్ వరదరాజన్ పేర్కొన్నారు. సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని 'ఎమెస్కో' ఆధ్వర్యాన ఢిల్లీలోని ఇండియన్ ఇస్లామిక్ సెంటర్‌లో 'డాక్టర్ వైఎస్ఆర్ సార్మక ఉపన్యాసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సిద్ధార్థ్ వరదరాజన్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెవిపి రామచంద్రరావు, హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, కొప్పుల రాజు, గిడుగు రుద్రరాజు తదిరులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'ది ఐడియా ఆఫ్ సెక్యులరిజం' అనే అంశంపై ముఖ్య అతిథిగా విచ్చేసిన జర్నలిస్టు సిద్ధార్థ్ వరదరాజన్ ప్రసంగించారు. దేశంలో ఓ వర్గాన్ని టార్గెట్ చేస్తూ, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జై శంకర్ వంటి నేతలు ప్రసంగాలు చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. దేశంలో మొట్టమొదటిసారి ముస్లిములకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్ఆర్‌దేనని సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి అన్నారు.

నెతన్యాహూ గద్దె దిగు !

ఇజ్రాయిల్‌లో ఊపందుకున్న ర్యాలీలు, ప్రదర్శనలు

5లక్షలమంది వీధుల్లోకి

సమ్మెతో స్తంభించిన కార్యకలాపాలు



ఆందోళన చేస్తున్న ప్రజలు

టెల్ అవీవ్ : గాజాలో హమాస్ చెరలో బందీలుగా వున్న వారిని విడిపించడంలో విఫలమైన నెతన్యాహు ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని, కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాలని కోరుతూ సోమవారం దేశవ్యాపిత సమ్మె జరిగింది. ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయంతో సహా అన్ని వ్యాపార వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు మూతపడ్డాయి. పలు పట్టణాలు, నగరాల్లో వేలాది మందితో నిరసన ర్యాలీలు జరిగాయి. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. గాజాలోని రఫాలో ఆరుగురు బందీల మృతదేహాలు కనుగొన్న నేపథ్యంలో బందీల కుటుంబాల్లో, ప్రజల్లో తీవ్ర నిరసనలు, అసంతృప్తులు పెల్లుబికాయి. ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత వేలాదిమంది ఇజ్రాయిలీలు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వం పట్ల తమ నిరసన వ్యక్తం చేశారు. దాదాపు 11 మాసాలుగా జరుగుతున్న ఈ దాడులకు స్వస్తి పలుకుతూ తక్షణమే హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని నినదించారు. అప్పటివరకు ఈ ఆందోళనలు విరమించేది లేదని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్‌లోని అతిపెద్ద కార్మిక సంఘమైన హిస్తాడ్రట్ సోమవారం సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. డగాజాపై దాడులు ఆరంభమైన తర్వాత ఇలా సమ్మె జరగడం ఇదే మొదటిది. బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణలతో సహా ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ప్రధాన రంగాలు మూతపడేలా చేయాలన్నది ఈ సమ్మె ఉద్దేశం. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, పెద్ద పెద్ద మాల్స్ అన్నీ మూతపడ్డాయి. విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది. పాఠశాలలు పనిచేయలేదు. ప్రజా రవాణా కూడా కొంతమేర స్తంభించింది. టెల్‌అవీవ్‌తో సహా సెంట్రల్ ఏరియాలోని మున్సిపాలిటీలన్నీ సమ్మెలో పాల్గొన్నాయి. జెరూసలేంతో సహా మరికొన్ని మున్సిపాలిటీలు సమ్మెలో పాల్గొనలేదు. రాజకీయ దురుద్దేశంతో పిలుపునిచ్చిన ఈ సమ్మెను రద్దు చేయాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం లేబర్‌కోర్టుకు విజ్ఞప్తి చేసిందని మీడియా వార్తలు పేర్కొన్నాయి. సొరంగంలో ఆ ఆరుగురు బందీలు నిర్బంధించబడ్డారని, సైన్యం అక్కడకు వెళ్లేసరికే వారిని అత్యంత దగ్గర నుండి కాల్చి చంపేసినట్లు తెలుస్తోందని ఇజ్రాయిల్ పేర్కొంటోంది. ఇలా బందీలను హతమార్చేవారు కాల్పుల విరమణ ఒప్పందాన్ని కోరుకోవడం లేదని నెతన్యాహు ఆరోపించారు. కొత్త డిమాండ్లు జారీ చేయడం ద్వారా చర్చల నుండి వైదొలగిన ఇజ్రాయిల్, అమెరికాలే ఈ హత్యలకు కారణమని హమాస్ పేర్కొంది.

11మంది మృతి

నిర్వాసితులైన పాలస్తీనియన్లు తలదాచుకున్న స్కూలుపై ఇజ్రాయిల్ దాడి చేయడంతో 11మంది చనిపోయారు.



మహ్మద్ యూనస్‌తో భేటీ అయిన అమెరికా చార్జి డీ అఫైర్స్ హెలెన్ లాఫవె

తాత్కాలిక ప్రభుత్వానికి పూర్తి మద్దతు

- యూనస్‌తో భేటీలో అమెరికా ఉన్నతాధికారి

ఢాకా : బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని అమెరికా ప్రకటించింది. తాత్కాలిక ప్రభుత్వంతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకుంటామని తెలిపింది. అమెరికా చార్జి డీ అఫైర్స్ హెలెన్ లాఫవె సోమవారం ఇక్కడ స్టేట్ గెస్ట్ హౌస్‌లో ప్రభుత్వ ముఖ్య సలహాదారు ప్రొఫెసర్ మహ్మద్ యూనస్‌తో సమావేశమై తాజా పరిణామాలపై చర్చించారు. బంగ్లా ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఈ వారంలో ఢాకాలో అమెరికా ఎంబసీలో వీసా ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.. ఆరోగ్యం, విద్య, కార్మిక వ్యవహారాలు, రోహింగ్యా సంక్షోభం వంటి కీలక రంగాల్లో బంగ్లాదేశ్‌కు సహకరించనున్నట్లు తెలిపారు. రోహింగ్యా శరణార్థులకు మానవతా సాయాన్ని అందచేయడానికి ఈ ఏడాది నిధులు పెంచనున్నట్లు తెలిపారు. వారికి జీవనోపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం వుందన్నారు. అమెరికా అందచేస్తున్న మద్దతుకు యూనస్ కృతజ్ఞతలు తెలియచేశారు.

ఆప్ ఎమ్మెల్యే అమ్నాతుల్లా అరెస్టు

- మనీలాండరింగ్ కేసులో ఇడి చర్య

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అమ్నాతుల్లా ఖాన్‌ను సోమవారం ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) అధికారులు అరెస్టు చేశారు. తన ఇంటిపై ఇడి దాడి చేసేందుకు ప్రయత్నిస్తోందని, తనని అరెస్టు చేసే అవకాశం ఉందని అమ్నాతుల్లాఖాన్ సోమవారం ఉదయం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేసిన వీడియోలో పేర్కొన్నారు. ఆ వీడియో పోస్టు చేసిన కొద్దిసేపటి తర్వాత ఇడి అధికారులు అమ్నాతుల్లా ఖాన్‌ని అరెస్టు చేశారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు అధినేతగా ఉన్న సమయంలో పలు నియామకాల్లో ఖాన్ అవకతవకలకు పాల్పడినట్లు ఇడి ఆరోపిస్తోంది.

మణిపూర్‌లో కొనసాగుతున్న కూంబింగ్

ఇంఫాల్ : ఇంఫాల్ పశ్చిమ జిల్లా కౌత్రుక్ వద్ద ఆదివారం జరిగిన దాడిలో ఇద్దరు మరణించగా, మరో తొమ్మిది మంది గాయపడటంతో, పోలీసులు భారీ ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ దాడిలో పాల్గొన్నవారిని అరెస్టు చేయాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని డిజిపిని కమిషనర్ (హోం) ఎన్.అశోక్ కుమార్ ఆదేశించారు. పోలీసుల సమాచారం ప్రకారం ఆదివారం జరిపిన దాడిలో రాకెట్‌తో నడిచే గ్రెనేడ్లు, డ్రోన్లను సాయుధులు ఉపయోగించారు. ఈ దాడిలో అనేక ఇళ్లు కూడా ధ్వంసమైనట్లు పోలీసులు తెలిపారు. దాడిలో పేలుడు పదార్థాలను వినియోగించడానికి హైటెక్ డ్రోన్లను ఉపయోగించడం పోలీసుల్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఆదివారం దాడిలో సాంకేతిక నైపుణ్యం, అత్యంత శిక్షణ పొందిన నిపుణుల భాగస్వామ్యాన్ని తోసిపుచ్చలేమని పోలీసులు చెబుతున్నారు. ఆదివారం కౌత్రుక్ గ్రామంలో డ్రోన్ల నుంచి కనీసం ఐదు బాంబులు పడినట్లు పోలీసులు తెలిపారు. డ్రోన్ల ద్వారా పేలుడు పదార్థాలను ఉపయోగించడం రాష్ట్రంలో కొత్తపద్ధతిగా పోలీసులు చెబుతున్నారు.



7 కీలక పథకాలకు ఆమోదం

- రూ.14,235.30 కోట్లు ఖర్చు
- ముంబాయి-ఇండోర్ మధ్య రూ.18,036 కోట్లతో 309 కిలోమీటర్ల రహదారి
- గుజరాత్‌లోని సనంద్‌లో సెమీ కండక్టర్ పరిశ్రమ
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



వ్యవసాయ రంగానికి సంబంధించిన 7 కీలమైన పథకాలను కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకాలకు కేంద్ర ప్రభుత్వం రూ.14,235.30 కోట్లు ఖర్చు చేయనుంది. సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మూడు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం కేంద్ర మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రూ.2,817 కోట్ల డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పథకం, క్రాప్ సైన్స్ కోసం రూ.3,979 కోట్లు కేటాయించింది. వ్యవసాయ విద్య, నిర్వహణను బలోపేతం చేసేందుకు రూ.2,291 కోట్ల విలువైన కార్యక్రమానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. పశువుల సుస్థిర ఆరోగ్యం, వాటి ఉత్పత్తి కోసం రూ.1,702 కోట్లతో స్కీమ్‌కు సైతం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఉద్యానవనాల సుస్థిర అభివృద్ధికి రూ.1,129.30 కోట్లతో మరో బృహత్తర పథకానికి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. దీంతోపాటు వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలను బలోపేతం చేసేందుకు రూ.1,202 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. సహజ వనరుల నిర్వహణకు సంబంధించిన పథకానికి రూ.1,115 కోట్లు వెచ్చించనున్నారు. ఏడు పథకాలకు రూ.14,235.30 కోట్లకుపైగా నిధులు కేటాయించినట్లు అశ్విని వైష్ణవ్ వివరించారు. ముంబాయి-ఇండోర్ రహదారికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 309 కిలోమీటర్ల రహదారికి రూ.18,036 కోట్లు ఖర్చు చేయనున్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమల్ని ప్రోత్సహించే లక్ష్యంతో గుజరాత్‌లోని సనంద్‌లో ఒక సెమీ కండక్టర్ పరిశ్రమను ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.



సందీప్ ఘోష్‌ను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న అధికారులు (మధ్యలో)

ఆర్‌జి కర్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అరెస్ట్

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్ రాజధాని కొల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం కేసులో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్‌జి కర్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను సిబిఐ అరెస్టు చేసింది. మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన కేసులో సందీప్ ఘోష్‌ను ఇటీవల విచారించిన సిబిఐ తాజాగా ఆయన్ను అరెస్టు చేసింది. ఆర్‌జి కర్ మెడికల్ కళాశాలలో జరిగిన ఆర్థిక అవకతవకల ఆరోపణలపై నేరపూరిత కుట్ర, మోసం, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద సందీప్ ఘోష్‌పై కేసులు నమోదయ్యాయి. తొలుత వీటిని కొల్‌కతా పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు చేసినప్పటికీ హైకోర్టు ఆదేశాలతో ఈ కేసును ప్రస్తుతం సిబిఐ విచారణ చేస్తోంది. ఈ క్రమంలోనే ఆయన నివాసంలో సోదాలు నిర్వహించిన సిబిఐ ఆయన్ను విచారించింది. సోమవారం అరెస్టు చేసింది. ఫిబ్రవరి 2021 నుంచి సెప్టెంబర్ 2023 వరకు ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా డాక్టర్ సందీప్ ఘోష్ పనిచేశారు. ఆ ఏడాది అక్టోబర్‌లో బదిలీ అయినప్పటికీ నెల తిరగకుండానే మళ్లీ అదే స్థానానికి తిరిగి వచ్చారు. ఇటీవల అదే కళాశాలలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం జరిగిన మరుసటి రోజు వరకు ఆ పదవిలోనే కొనసాగారు.

కేంద్ర ప్రభుత్వం పునరావాసం కల్పించాలి


- వరద సహాయ చర్యల్లో పార్టీ శ్రేణులు పాలుపంచుకోవాలి : రాహుల్ గాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వరదలతో సతమతమవుతున్న ఎపి, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ కల్పించాలని లోక్‌సభ పక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వరద పరిస్థితిపై విచారం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు బాసటగా నిలవాలని, సహాయ పునరావాస కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు, వరదలతో సమస్యలు ఎదుర్కొంటున్న ఎపి, తెలంగాణ ప్రజల బాగోగులపై తాను కలత చెందుతున్నానని, వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని సోమవారం ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ పోస్టు చేశారు. ఈ విపత్తుతో నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, ఎపి ప్రభుత్వం తక్షణమే సమగ్ర పునరావాస ప్యాకేజ్‌లను కల్పించాలన్నారు.







నిజాయితీ

మనపురం గ్రామ హైస్కూల్లో సోషల్ ఉపాధ్యాయుడుగా స్వప్నిక్ పనిచేస్తున్నారు. తను బోధించే పదో తరగతి గదిలో రోజూ ఏదో ఒకటి విద్యార్థుల వస్తువులు, పెన్నులు, పెన్సిళ్లు, పుస్తకాలు, డబ్బులు పోతున్నాయి. అసలు తీస్తున్నది ఎవరనేది తెలుసుకోవాలని భావించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, నిజాయితీని పరీక్షించేందుకు ఓ ఉపాయాన్ని ఆలోచించారు. అందరికీ ఒక్కొక్క విత్తనాన్ని ఇచ్చి మీ ఇంటి వద్ద కుండీలో నాటి పది రోజులపాటు పెంచి తీసుకురమ్మని సూచించారు. 'ఎవ్వరి మొక్క ఎదుగుదల ఉంటుందో, పువ్వులు పూస్తాయో వారే క్లాస్ లీడర్.అంతేకాకుండా నిజాయితీ పరులెవ్వరో తెలుస్తుంది' అంటూ ప్రకటించారు. వచ్చేటప్పుడు బయటకు కనబడకుండా అందరూ అట్టపెట్టెలో తేవాలని సూచించారు. అనుకున్న గడువు ముగిసింది. అందరూ మొక్కలు అట్టపెట్టెల్లో తెచ్చారు. వరసక్రమంలో అందర్నీ నించోమని చెప్పిన మాస్టర్ ఒక్కొక్కరుగా తమ పెట్టెలో తెరవాలని సూచించారు. ప్రతిఒక్కరూ అందరి మొక్కలను ఆసక్తికరంగా చూస్తున్నారు. రాము మొక్క పెద్దగా పెరిగి పువ్వులు కూడా పూశాయి. మిగిలిన వారివి చిన్నవి, పెద్దవిగా ఉన్నాయి. ఒక్క రాకేష్ కుండీ ఖాళీగా మొక్కే లేకుండా ఉంది. తనూ నీరసంగా ఉన్నాడు. పెద్దమొక్క తెచ్చిన రామునే క్లాస్ లీడర్ అవుతారని లోలోపల అనుకుంటున్నారు. అప్పుడు రాకేష్‌ను మాస్టర్ పిలిచి నీ మొక్క ఎందుకు పెరగలేదని ప్రశ్నించారు. 'ఏమోసార్ నేనైతే నీళ్ల పోశాను. నేను నిజమే చెబ్తున్నా.. సార్' అన్నాడు అమాయకంగా. మాస్టర్ స్పందిస్తూ 'రాకేష్‌ను క్లాస్ లీడర్‌గా నియమిస్తున్నా..అతడు చెప్పింది నిజం. ఎందుకంటే నేను ఉడకబెట్టిన విత్తనాలు ఇచ్చా. అవి మొలకెత్తవు. కానీ మీరంతా మొక్కలు, వాటికి పూలు పూయించినవి తెచ్చారు. ఒక్క రాకేష్ మాత్రం నేను ఇచ్చిన విత్తనాన్ని నాటి ఫలితాన్ని నిర్భయంగా చెప్పాడు' అన్నారు. దీంతో మిగతా విద్యార్థులు తలదించుకుని తాము చెప్పిన తప్పును ఒప్పుకున్నారు. అప్పుడు మాస్టర్ తన సందేశంలో 'మీ తోటి విద్యార్థుల్ని స్నేహితుడిగా భావించండి. వారి వస్తువులను మీ వస్తువులుగా మీ వస్తువు పోతే ఎంత బాధ పడతారో.. వారి వస్తువు పోతే అంతే బాధపడతారు. ఈ విషయాన్ని గ్రహించండి. ఇంకెప్పుడూ ఇలాంటి తప్పులు చేయకండి. నేటి బాలలే ..రేపటి పౌరులని .. సమాజ నిర్మాతలని , విద్యార్థులు అసమానతలు లేని సమసమాజాన్ని నిర్మించాలి' అంటూ వివరించారు. ఆ తర్వాత విద్యార్థులంతా ఐకమత్యంతో స్నేహభావంతో మెలుగుతూ ఆదర్శ విద్యార్థులుగా మెలగటం ప్రారంభించారు. మాస్టర్ సంతోషించారు.

– ఎస్. కె. బాజీ సైదా,
88972 82981

జల ప్రళయం



చినుకు చినుకు కురిసింది
వానజల్లుగా మారింది
గూనధారలై సాగింది
వాగులు వంకలు పొర్లాయి
నదులు, సముద్రాలు ముందుకు సాగాయి
చెరువులు, కుంటలు తెగిపోయాయి
కళంగులు పొంగిపొర్లుతున్నాయ్
పంట పొలాలన్నీ జలసముద్రాలుగా మారాయ్
కృష్ణమ్మ పరవళ్ల వరవళ్లుగా..
గోదావరి ఉగ్రరూపంతో లోతట్టు ముంపుమయం
రహదారులు కనిపించటం లేదు
జలదిగ్బంధనం నుంచి బయటపడే మార్గం లేదు
అకాల జలప్రళయం
అపార నష్టంతో విలయం
జనజీవనం అస్తవ్యస్తం
ముంపు బాధితుల బాధలు వర్ణనాతీతం
ప్రతిఒక్కరూ స్పందించాలి కనికరం
ప్రభుత్వాలు చూపాలి మానవత్వం
– ఉండ్రాళ్ల రాజేశం, సిద్ధిపేట, 99669 46084

నేను గీసిన బొమ్మ





ఎన్.శ్రీనిధి,
6వ తరగతి, సైబరేడ్ స్కూల్,
మేడ్చల్, మల్కాజ్గిరిజిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జ్వరాలు.. జరభద్రం

వర్షాకాలంలో వర్షాలు కురుస్తుండటం సహజమే. కానీ అకాల వర్షాలు.. విపరీతమైన ఎండలు ఇటీవలకాలంలో అనారోగ్య వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. తాజాగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో జన జీవనం అతలాకుతలమైంది. ఈ క్రమంలో ప్రతిఒక్కరూ తమ ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణంలో వచ్చిన మార్పులతో ఈ కాలంలో రోగ నిరోధక శక్తి బలహీనపడుతుంది.ఫ్లూ, దగ్గు జలుబు వంటి ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లు రాకుండా అదనపు జాగ్రత్తలు తీసుకోడం చాలా ఉత్తమం. ఒక వేళ వస్తే వాటి నుంచి ఉపశమనం పొందే మార్గాలు–చిట్కాలను కూడా తెలుసుకోవటం మంచిది. వర్షాలు కురిసే సమయంలో వైరల్ ఇన్ఫెక్షన్లు, గొంతునొప్పి, దగ్గు జలుబు లాంటివి సాధారణంగానే వస్తుంటాయి. వీటితోపాటుగా విష జ్వరాలు, ఫ్లూ, కడుపు నొప్పి సమస్యలు వంటి ఇన్ఫెక్షన్లు కూడా వస్తుంటాయి. ఈ కాలంలో వైరల్ ఇన్ఫెక్షన్ అనేది అత్యంత సాధారణ లక్షణం జ్వరం. సాధారణంగా శరీరం ఒక రకమైన బ్యాక్టీరియా లేదా వైరల్ ఇన్ఫెక్షన్‌తో పోరాడటానికి ప్రయత్నిస్తున్నదనే దానికి సంకేతం. ఈ వర్షాకాలంలో వైరల్ ఇన్ఫెక్షన్లను అరికట్టడంలో సహాయపడే కొన్ని అంశాలను తెలుసుకుందాం.

పరిశుభ్రత కీలకం : సరైన పరిశుభ్రత పాటించటం వల్ల వర్షాకాలంలో వైరల్ ఇన్ఫెక్షన్లను నివారించొచ్చు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలి. తద్వారా బ్యాక్టీరియా వ్యాప్తిచెందకుండా ఉంటుంది. తినే ఆహారమే వైరస్‌లు, ఇన్‌ఫెక్షన్లను కల్గిస్తుంది. అందువల్ల వేడిగా ఉండే మంచి ఆహారాన్నే తీసుకోవాలి. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి. అపరిశుభ్ర వాతావరణంలో చాలా సూక్ష్మక్రిములు సంతానోత్పత్తి చేస్తుంటాయి. అందువల్ల పండ్లు, కూరగాయలు తాజావి తినటం ఎంతో మేలు.

హైడ్రేడ్‌గా ఉండాలి : మిమ్మల్ని మీరు బాగా హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. అవసరమైనంత నీరు తప్పనిసరిగా తాగాలి. ఇది ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంచుతుంది. వ్యాధులు రాకుండా చేస్తుంది. బరువు తగ్గడానికి సహాయం చేయడంతోపాటుగా హైడ్రేటెట్‌గా ఉండటం జెర్మ్, ఇన్ఫెక్షన్లతో పోరాడటంతో సహాయపడుతుంది.

మంచి నిద్రపోవాలి : ఆరోగ్యకరమైన రోగ నిరోధకశక్తికి మంచి రాత్రి నిద్ర ముఖ్యం. నిద్రను కోల్పోవడం లేదా రోజుకు ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోవటం వల్ల నిద్రలేమికి దారితీయొచ్చు. తద్వారా అలసటతోపాటు మీ శరీరాన్ని బలహీనంగా చేస్తుంది. అంటువ్యాధులు, వైరల్ ఫీవర్‌ను అంటుకునే అవకాశం కూడా చాలా ఉంటుంది.



అధిక వర్షాలు, వరదలతో అతలాకుతలమైన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చాలాచోట్ల పారిశుధ్య పరిస్థితి క్షీణిస్తోంది. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉంది. మలేరియా, డెంగ్యూ, డయేరియా, విష జ్వరాలు తదితర వ్యాధులు ప్రజలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే పలుచోట్ల జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో మరింత అప్రమత్తత అవసరం.

కలుషిత ఆహార పదార్థాలకు దూరం : హైడ్రేటెట్‌గా ఉండటం ఎంత ముఖ్యమో, నీరు స్వచ్ఛంగా, శుభ్రంగా ఉండేలా చూసుకోవటం కూడా అత్యంత ముఖ్యం. వంట చేయటానికి ముందు కూరగాయలు బాగా కడగాలి. పండ్లను తినేముందు శుభ్రంగా కడగాలి. స్ట్రీట్‌ఫుడ్ సాధ్యమైనంత వరకూ తినకుండా ఉండటం మేలు. జలుబు, జ్వరంతోపాటుగా అనారోగ్యంతో ఉన్నప్పుడు తాగునీరు, తినే ఆహారాన్ని పంచుకోవటం చేయరాదు. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాలను తీసుకోవాలి.

వివిధ జ్వరాలు–వాటి లక్షణాలు

రక రకాల జ్వరాలకు దోమలే కారణం. అందువల్ల దోమల నివారణకు కూడా చర్యలు తీసుకోవాలి. మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వర్షాలవల్ల పరిసరాల్లోని దోమల సంఖ్య బాగా పెరుగుతుంది. వీటివల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దోమలు కుట్టకుండా నిండుగా దుస్తులు ధరించాలి. దోమలు రాకుండా ఆపే పిపెల్లెంట్స్ కూడా వాడొచ్చు.

డెంగ్యూ : ఇది ఏడెస్ దోమకాటు వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు ఎక్కువగా నిల్వ ఉండే నీటిలో పెరుగుతాయి. వర్షపు నీటి గుంటలు, పాతటైర్లు, కుండీలు లాంటి వాటిలో ఈ దోమలు నివాసం ఉంటాయి. పగటి పూట ఇవి ఎక్కువగా కుడతాయి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి (ముఖ్యంగా తల ముందు భాగంలో), ఒళ్లనొప్పులు, వాంతులు లాంటివి డెంగ్యూ ప్రధాన లక్షణాలు, చర్మమంతా ఎరువు రంగులోకి మారే అవకాశం ఉంది. జ్వరం ఉధృతంగా రావడం, కళ్లు కదిలించలేని స్థితి, కండరాలు, కీళ్లనొప్పులు ఉంటాయి. శరీరంపై ఎర్రటి దద్దుర్లు వస్తాయి. వాంతి వచ్చినట్లు అవుతుంది. నోరు ఎండిపోయి దాహం ఎక్కువ అవుతుంది.

మలేరియా : చలి, వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. తలనొప్పి ఉంటుంది. రోజు విడిచి రోజు జ్వరం వస్తుంది. ఎక్కువగా చెమటలు పడుతుంటాయి.

మెదడువాపు : ఆకస్మికంగా జ్వరం వస్తుంది. విపరీతమైన తలనొప్పివస్తుంది. వాంతులు అవుతాయి. అపస్మారక స్థితిలోకి చేరుకోవటం, మూర్ఛ లక్షణాలు కన్పిస్తాయి.

చికున్‌గున్యా : ఆకస్మికంగా జ్వరం రావటం, తలనొప్పి, కీళ్లనొప్పులు, ఒళ్లు నొప్పులు వస్తుంటాయి.

స్క్రబ్‌టైఫస్ : ఈ జ్వరం తాజాగా బాగా విస్తరిస్తోంది. విపరీమైన జ్వరం, విపరీతమైన నొప్పులు, ప్లేట్‌లెట్లు పడిపోవటం జరుగుతుంది.

పైన పేర్కొన్న జ్వరాలకు సంబంధించి డాక్టరు సూచించిన మందులను వాడితే రెండోమూడు రోజుల్లో తగ్గిపోతాయి. డెంగ్యూ, స్క్రబ్‌టైఫస్ రోగాలు తగ్గటానికి కొంచెం సమయం పడుతుంది.

శ్వాసకోశ వ్యాధులు : వర్షాలు–వరదల సమయంలో జ్వరం, జలుబు, గొంతునొప్పి, దగ్గు నుంచి ఆయాసం వంటి సమస్యలు వస్తాయి. వీటి నివారణ, అరికట్టడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.



ఇవి పాటించండి

- పాతటైర్లు, డ్రమ్ములు, రోళ్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు లేకుండా చూసుకోవాలి
- సాయంత్రం చీకటి పడే ముందు తలుపులు, కిటికీలు మూసేస్తే దోమలు ఇంట్లోకి రాకుండా నివారించొచ్చు
- నిద్రించేటప్పుడు దోమ తెరలు వాడాలి
- జ్వరం వచ్చిన తర్వాత ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలి
- చలిలో ఎక్కువసేపు ఉండరాదు. పిల్లల చెవులను కప్పేలా దుస్తులు వేయాలి. చెవుల్లో దూది పెట్టుకుంటే మంచిది.
- జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలున్న వారు తప్పకుండా మాస్కు ధరించాలి.
- చేతులను సబ్బుతో కడగటం లేదా శానిటైజర్ వాడటం మంచిది
- శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది లేదా ఆయాసం ఉంటే ఇన్‌హేలర్ వాడాలి

శ్వాసకోశ సవ్యాధులు :
నివారణలో ఇలాంటి చర్యలు ఎంతోమేలు
- ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను చేకుండా చేసుకోవాలి.
- నిల్వవున్న నీటిలో కిరసనాయిల్ లేదా వాడిన ఆయిల్ చల్లాలి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..
- క్లోరినేషన్ చేసిన, కాచి వడబోసి చల్లార్చిన నీటినే తాగాలి
- కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గంజి, పళ్లరసాలు తాగాలి
- ఓఆర్ఎస్ ద్రావణాన్ని గంట గంటకు తీసుకోవాలి



– డాక్టర్ వసంతం వీరరాఘవయ్య,
సంజీవని ఎమర్జెన్సీ, స్పెషాలిటీ హాస్పటల్, రేపల్లె, బాపట్ల జిల్లా.

పవన్ కళ్యాణ్‌కు అల్లు అర్జున్ శుభాకాంక్షలు



పవన్, అల్లు అర్జున్ పరస్పర అభినందన (ఫైల్‌ఫొటో)

సినీనటుడు, డిప్యూటీసిఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ తన పుట్టిన రోజు వేడుకలను సోమవారం జరుపుకున్నారు. ఆయన అభిమానులు కూడా పలుచోట్ల జరిపారు. హీరో అల్లు అర్జున్ కూడా పవన్‌కళ్యాణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని అల్లు అర్జున్ శుభాకాంక్షలు తెలిపిన సంగతి తెలిసిందే. అయితే కొద్దిరోజులుగా బన్నీ, మెగా ఫ్యాన్స్ మధ్య వార్ నడుస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో 'తనకు నచ్చితే, తాను ఇష్టపడితే, అండగా నిల్చోవడానికి, ఎక్కడికైనా వెళ్లడానికి వెనుకాడను' అంటూ వ్యాఖ్యలు చేశారు. అల్లు అర్జున్ పుష్ప–2 సినిమా షూటింగ్‌లో బిజీగా గడుపుతున్నారు. డిసెంబర్ ఆరోతేదీన విడుదల కానున్న విషయం తెలిసిందే. 2021లో వచ్చిన 'పుష్ప'కు సీక్వెల్‌గా ఈ చిత్రం రానుంది.

హేమా కమిటీ నివేదికపై హైకోర్టులో పిటిషన్

మలయాళ చిత్ర పరిశ్రమను కుదిరిపేస్తోన్న హేమా కమిటీ గురించి జాతీయస్థాయిలో చర్చ జరుగుతోంది. అక్కడి పరిశ్రమలో పనిచేసే మహిళలు లైంగిక దాడికి గురౌతున్నారని హేమా కమిటీ పేర్కొంది. కొద్దిరోజుల క్రితం ఆ నివేదికను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయ్‌కు కమిటీ అందించింది. దీంతో చాలామంది బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని తెరమీదకు తీసుకొచ్చారు. తాజాగా హేమా కమిటీ నివేదికపై జరిగే విచారణను సీబీఐకి వదిలేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు న్యాయవాదులు ఎ.జన్నాత్, అమృతా ప్రేమ్‌జిత్ కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తును సీబీఐకు అప్పగించాలని వారు డిమాండ్‌చేశారు. హేమా కమిటీ ముందు వాంగ్మూలం ఇచ్చిన వారికి భద్రత కల్పించాలని పిటిషన్‌లో కోరారు. సినిమా రంగంలో మహిళల భద్రతకు చట్టం అవసరమని ఈ మేరకు కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు.

నవంబర్‌లో 'గదాధారి హనుమాన్'



విరభ్ స్టూడియోస్ సమర్పణలో రోహిత్ కొల్లిని దర్శకుడిగా పరిచయం చేస్తూ తీస్తున్న సినిమా 'గదాధారి హనుమాన్'. తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రవి, హర్షిత, బసవరాజు, రమేష్ పండిట్, నగేష్‌మైయ్య, కళ్యాణ్ కీలకపాత్రలు పోషించారు. తాజాగా టైటిల్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా రోహిత్ కొల్లి మాట్లాడుతూ 'గదాధారి హనుమాన్' సినిమాని ఆద్యంతం అన్ని అంశాలతో చాలా అద్భుతంగా తీశామన్నారు. ప్రేక్షకులు కూడా ఈ సినిమా చూసి 'కల్కి', 'హనుమాన్'లాంటి బ్లాక్‌బస్టర్ చేస్తారనే నమ్మకంతో ఉన్నామన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంతో జరుగుతుందన్నారు. త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తిచేసుకుని నవంబర్‌లో సినిమాను విడుదల చేస్తామని వివరించారు.

తండ్రికి తగ్గ తనయుడు బాలకృష్ణ : చిరంజీవి



'బాలయ్య బాబు సినీ స్వర్ణోత్సవంలో మేము పాలుపంచుకోవడం మాకు చాలా ఆనందం. ఇది బాలయ్యకు మాత్రమే కాదు. తెలుగు చలన చిత్రానికి ఒక వేడుకలా చూస్తున్నాను. అరుదైన రికార్డు బాలయ్య సొంతం చేసుకున్నందుకు సంతోషం. కీర్తిశేషులు నందమూరి తారక రామారావుకు ప్రజల మదిలో ప్రత్యేక స్థానం ఉంది. ఆయన కొడుగ్గా నందమూరి బాలకృష్ణ తండ్రి చేసిన పాత్రలను వేస్తూ ప్రేక్షకులను మెప్పించడం మామూలు విషయం కాదు. తండ్రికి తగ్గ తనయుడిగా తన ప్రత్యేకత చాటుకున్నారు. నేను 'ఇంద్ర' సినిమా చేయడానికి ఆదర్శం కూడా 'సమరసింహారెడ్డి'. నాకు బాలయ్యతో కలిసి ఒక ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఒక కోరిక. ఫ్యాన్స్ గొడవలు పడుతుంటారు. ఫ్యాన్స్‌కోసం హీరోల మధ్య ఎలాంటి మంచి బంధం ఉంటుందో తెలియడం కోసం కొన్ని వేడుకలు చేసుకునేవాళ్లం. అందుకే మా అభిమానులు కూడా కలిసికట్టుగా ఉంటారు. మా ఇంట్లో ఎలాంటి శుభకార్యం జరిగినా బాలయ్య రాకుండా ఉండరు. అందరూ కలిసి డ్యాన్స్ కూడా చేస్తారు. 50 సంవత్సరాల ఈ ప్రయాణం ఇంకా హీరోగా నటించే ఘనత బాలయ్యకే సొంతం. బాలకృష్ణ రాబోయేకాలంలో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుతున్నా. రాజకీయ, వైద్య రంగాల్లో ఇలా చేయడం నభూతో న భవిష్యత్. మేము అంతా ఒక కుటుంబం లాంటి వాళ్లం. ఫ్యాన్స్ అర్థం చేసుకోవాలని కోరుకుంటూ లాంగ్‌లివ్ బాలయ్య' అని హీరో చిరంజీవి వ్యాఖ్యానించారు. నందమూరి హరికృష్ణ నటుడిగా సినీ ఇండస్ట్రీలో 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర పరిశ్రమ, అభిమానులు కలిసి బాలయ్య సినీ స్వర్ణోత్సవ వేడుకలు హైదరాబాద్‌లోని నోవాటెల్ ఆడిటోరియం వేదిగా ఘనంగా జరిగాయి. హీరో దగ్గుపాటి వెంకటేష్ కూడా మాట్లాడారు. సినీ, రాజకీయ ప్రముఖులంతా హాజరయ్యారు. నందమూరి కుటుంబ సభ్యులతోపాటు టి.సుబ్బరామిరెడ్డి, రఘురామకృష్ణంరాజు, కె.రాఘవేంద్ర రావు, మురళీమోహన్, విజయేంద్రప్రసాద్, రాజశేఖర్ దంపతులు, అశ్వనీదత్, అల్లు అర్జున్, సుహాసిని, నాని, మంచు విష్ణు, మాలశ్రీ, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు, గోపీచంద్, బోయపాటి శ్రీను, పి.వాసు, జయసుధ, మంచు విష్ణు, విశ్వక్‌సేన్, సిద్ధు జొన్నలగడ్డ తదితరులు హాజరయ్యారు.

సందీప్ కిషన్ ఆర్థిక సహాయం



టాలీవుడ్ హీరో సందీప్ కిషన్ ఓ మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సోషల్ మీడియాలో వచ్చిన విజ్ఞప్తికి స్పందించిన ఆయన వెంటనే ఆర్థిక సహాయం అందజేశారు. హీరో ధనుష్‌తో కెప్టెన్ మిల్లర్ చిత్రంలోనూ కీలక పాత్ర పోషించారు. గతంలో రాయన్ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాను నిర్వహిస్తున్న రెస్టారెంట్ల నుంచి ప్రతిరోజూ 350 మందికి ఉచితంగా ఆహారాన్ని పంపిణీచేస్తున్నారు. ఈ మేరకు నెలకు రూ.4 లక్షలు మొత్తాన్ని కేటాయిస్తున్నానని సందీప్ తెలిపారు. భవిష్యత్తులో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తక్కువ ధరకే క్యాంటీన్లు పెట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు వివరించారు. 'రాయన్' సినిమాలో ధనుశ్‌కు తమ్ముడిగా సందీప్ నటించిన విషయం తెలిసిందే.

బ్యాడ్మింటన్‌లో నితీశ్‌కు స్వర్ణం



యోగేశ్ కతునియా(రజతం)

- డిస్కస్ త్రోలో యోగేశ్‌కు రజతం
- బ్యాడ్మింటన్‌లో మనీషాకు కాంస్యం
- అథ్లెటిక్స్‌లో ప్రీతికి మరో పతకం

పారిస్: పారా ఒలింపిక్స్‌లో భారత్‌కు ఒకేరోజు ఎనిమిది పతకాలు దక్కాయి. బ్యాడ్మింటన్ ఏకంగా ఆరు పతకాలు లభించగా.. డిస్కస్ త్రో, అథ్లెటిక్స్ విభాగాల్లో ఒక్కో పతకం దక్కింది. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ స్వర్ణ పతక పోటీలో నితీశ్ కుమార్ పసిడి పతకం కొల్లగొట్టాడు. సోమవారం జరిగిన బ్యాడ్మింటన్ సింగిల్స్ ఎస్ఎల్–3 ఫైనల్లో నితీశ్ 21–14, 18–21, 23–21తో బ్రిటన్‌కు చెందిన డానియల్ బెథెల్‌ను మూడు సెట్లలో ఓడించి స్వర్ణ పతకం సాధించాడు. సెమీస్‌లో కుమార్ నితేశ్.. 21–16, 21–16తో ఫుజిహర (జపాన్)ను ఓడించి ఫైనల్స్‌కు చేరాడు. పారా ఒలింపిక్స్ 2024లో భారత్‌కు దక్కిన తొలి స్వర్ణ పతకం ఇదే. ఇక పురుషుల డిస్కస్ త్రోయర్ ఎఫ్–56లో యోగేశ్ కథునియా 42.22మీ. విసిరి రెండోస్థానంలో నిలిచి రజతంతో మెరిశాడు. మహిళల సింగిల్స్‌లో ఎస్‌యు–5లో మనీషా రాందాస్ 21–12, 21–6తో డెన్మార్క్‌కు చెందిన రొసెంగ్రెన్‌ను చిత్తుచేసి కాంస్య పతకం చేజిక్కించుకుంది. మరోవైపు.. బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌హెచ్6 కాంస్య పతక పోరులో శివరాజన్– నిత్యశ్రీ నిరాశపర్చారు. 17–21, 12–21తో ఇండోనేషియా జోడీ సుభాన్–రినా మార్లినా చేతిలో ఓటమి చవిచూశారు.

డిస్కస్ త్రోలో యోగేశ్‌కు రజతం

పారాలింపిక్స్‌లో భారత్ మరో రజత పతకం సాధించింది. పురుషుల డిస్కస్ త్రో ఎఫ్56లో యోగేశ్ కతునియా (42.22 మీటర్లు) రజతం దక్కించుకున్నాడు. బ్రెజిల్‌కు చెందిన క్లాడినీ బాటిస్టా (46.86 మీ) స్వర్ణం అందుకున్నాడు. గ్రీస్ దేశానికి చెందిన కాన్స్టాంటినోస్ జౌనిస్ (41.32 మీ) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. తాజాగా యోగేశ్ పతకం గెలవడంతో ఈ పారాలింపిక్స్‌లో భారత్ పతకాల సంఖ్య ఎనిమిదికి చేరింది. యోగేశ్‌కు పారాలింపిక్స్‌లో ఇది రెండో పతకం. టోక్యోలోనూ అతడు రజతం సాధించాడు.


ప్రీతి డబుల్ ధమాకా..

పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్ విభాగంలో ప్రీతి పాల్ మరో పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. మహిళల 200మీ. రేసులో ఆమెకు ఈ పతకం దక్కింది. దీంతో ఒక ఒలింపిక్స్ అథ్లెటిక్స్ విభాగంలో రెండు పతకాలు కొల్లగొట్టిన తొలి పారా అథ్లెట్‌గా ఆమె ఈ ఘనత సాధించింది. మహిళల 200మీ. (టీ35) రేసును 30.01 సెకన్లలోనే పూర్తిచేసి వరుసగా రెండో కాంస్యాన్ని సొంతం చేసుకుంది.

మహిళల సింగిల్స్ బ్యాడ్మింటన్ ఎస్‌యు–5లో తులసీమతి మురుగేశన్ ఫైనల్లో ఓటమిపాలైంది. స్వర్ణ పతక పోటీలో మురుగేశన్ 17–21, 10–21తో చైనాకు చెందిన జంగ్ చేతిలో ఓడింది. దీంతో రజత పతకం ఖాయం చేసుకుంది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్–4లో లలినకెరె 9–21, 13–21తో మజూర్(ఫ్రాన్స్) చేతిలో ఓటమిపాలై రజత పతకానికి పరిమితమయ్యాడు. మరో కాంస్యం శివమ్ బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో సాధించింది.



నితీశ్ కుమార్(స్వర్ణం)



కాంస్య పతకాలు సాధించిన మనీషా, ప్రీతి

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
1. చైనా	42	29	14	85
2. బ్రిటన్	29	14	10	53
3. అమెరికా	13	18	10	41
4. బ్రెజిల్	11	7	17	35
5. ఫ్రాన్స్	10	10	13	33
6. ఇటలీ	8	7	13	28
7. ఆస్ట్రేలియా	7	8	11	26
8. నెదర్లాండ్స్	7	2	4	13
9. ఉజ్బెకిస్తాన్	6	4	4	14
22. ఇండియా	2	5	6	13

నోట్: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం

క్వార్టర్స్‌కు సబలెంక, వేకిక్

కోకా గాఫ్ జోరుకు బ్రేక్



సబలెంక

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో మరో సంచలనం నమోదైంది. 3వ సీడ్, అమెరికా సంచలనం కోకా గాఫ్ జోరుకు ప్రి క్వార్టర్స్‌కు బ్రేక్ పడింది. సోమవారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో గాఫ్ 3–6, 6–4, 3–6తో 13వ సీడ్, అమెరికాకే చెందిన నవ్వారో చేతిలో ఓటమిపాలైంది. మరో పోటీలో 2వ సీడ్, టైటిల్ ఫేవరెట్ ఆర్యానా సబలెంక 6–2, 6–4తో 33వ సీడ్ మెర్టెన్స్(జర్మనీ)ని ఓడించగా.. 7వ సీడ్, జంగ్ 7–6(7–2), 4–6, 6–2తో 24వ సీడ్ వేకిక్(క్రొయేషియా)ను ఓడించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.

పోపొరిన్ జోరుకు బ్రేక్..

మూడోరౌండ్‌లో 2వ సీడ్ నొవాక్ జకోవిచ్‌ను ఓడించి ప్రి క్వార్టర్స్‌కు చేరిన పోపొరిన్ జోరుకు బ్రేక్ పడింది. సోమవారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో పోపొరిన్ 4–6, 6–7(3–7), 6–2, 3–6తో 20వ సీడ్, అమెరికాకు చెందిన టఫీ చేతిలో ఓటమిపాలయ్యాడు. మరో పోటీలో 4వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ) 3–6, 6–1, 6–2, 6–2తో నకషిమా (అమెరికా)ను ఓడించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు.

బోపన్న జోడీ ఓటమి

భారత సీనియర్ ఆటగాడు రోహన్ బోపన్న ప్రి క్వార్టర్స్‌లో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో ఫేవరేట్ అయిన బోపన్న–మాథ్యూ ఎబ్డెన్ జోడీ ప్రి క్వార్టర్స్‌లో 1–6, 5–7తో అర్జెంటీనా జంట చేతిలో ఓటమి పాలైంది. దాంతో, డబుల్స్‌లో తిరుగులేని జంటగా పేరొందిన వీళ్లకు నిరాశే మిగలింది.

బంగ్లాదేశ్ లక్ష్యం 185పరుగులు

పాకిస్తాన్‌తో రెండో టెస్ట్

రావల్పిండి: పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ జట్టు గెలుపుకు చేరువైంది. రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్‌ను 172పరుగులకే ఆలౌట్ చేయడంతో బంగ్లాదేశ్ 185పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. ఓవర్‌నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 9పరుగులతో మూడోరోజు ఆటను కొనసాగించిన పాకిస్తాన్‌ను బంగ్లాదేశ్ పేసర్లు కట్టడి చేశారు. మహ్మద్‌కు ఐదు, నహీద్ రాణాకు నాలుగు వికెట్లు పడగొట్టారు. ఇక పాకిస్తాన్ జట్టులో రిజ్వాన్(43), అఘా సల్మాన్(47) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో బంగ్లాదేశ్ 185పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి రాగా.. మూడోరోజు ఆట ముగిసేసమయానికి 7 ఓవర్లలో 42పరుగులు చేసింది. హసన్(31), ఇస్లామ్(9) క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 274పరుగులు చేయగా.. బంగ్లాదేశ్ 262పరుగులు చేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68